



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక    PEN POWER TELUGU DAILY    ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1  సంచిక : 115  పేజీలు :8  సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ)  ప్రచురణ : ఒంగోలు  బుధవారం 31 డిసెంబర్ 2025  వెల : 1/-రూ ॥

VOLUME :1  ISSUE :115  PAGES :8  EDITOR : G. A. RAO ( ANAND GANTYADA )  PUBLISHED : ONGOLE  WED 31 DECEMBER 2025  PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## అద్దంకి, కందుకూరు ప్రజల ఆకాంక్ష నెరవేరింది

- కందుకూరు నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలపడంపై హర్షం
- ప్రజల ఆకాంక్షల మేరకు అద్దంకికి రెవెన్యూ డివిజన్ మంజూరు చేసినట్టు వెల్లడి
- దుర్గుగుడిలో విద్యుత్ అంతరాయంపైనా మంత్రి వివరణ
- జనవరి 6 లేదా 7 తేదీల్లో దేవాదాయ శాఖతో ప్రత్యేక సమన్వయ సమావేశం




పెన్ పవర్ డెస్క్:అద్దంకి, కందుకూరు నియోజకవర్గ ప్రజల ఆకాంక్షను మన్నిస్తూ, ఆ ప్రాంతాలను తిరిగి ప్రకాశం జిల్లాలో కలుపుతూ రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం ఎంతో సంతోషదాయకమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నేడు జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం చేసిన అశాస్త్రీయ జిల్లాల విభజనను సరిదిద్దుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేసే నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు.యువగళం పాదయాత్ర సమయంలో నారా లోకేశ్ ఇచ్చిన హామీని గుర్తుచేస్తూ,

వివరాలు 2లో..



### శంకరగుప్తం మేజర్ డ్రైయిన్ ఆధునికీకరణ పనులకు
## పవన్ కల్యాణ్ శంకుస్థాపన

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పవన్ కల్యాణ్
- రూ. 20.77 కోట్ల అంచనా వ్యయంతో శంకరగుప్తం డ్రెయిన్ పనులకు శంకుస్థాపన
- క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్న డిప్యూటీ సీఎం



పెన్ పవర్ డెస్క్:కోనసీమ జిల్లా అభివృద్ధి కార్యక్రమాల్లో మరో కీలక అడుగు పడింది. జిల్లా పరిధిలోని శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, కోనసీమ జిల్లా కలెక్టర్, జల వనరుల శాఖ అధికారులు, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, కోనసీమలోని కొబ్బరి రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని రూ. 20.77 కోట్ల అంచనా వ్యయంతో శంకరగుప్తం డ్రెయిన్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభించామని తెలిపారు. ప్రత్యేకంగా, రాజోలు పర్యటనలో 45 రోజుల్లో సమస్యను పూర్తి చేయాలని హామీ ఇచ్చినప్పటికీ, 35 రోజుల్లోపే ఈ డ్రెయిన్ సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపించింది. డ్రెయిన్ ఆధునికీకరణ ద్వారా జిల్లా అభివృద్ధిలో కొత్త దశ ప్రారంభంకానుంది. శంకరగుప్తంలోని వర్షకాల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడానికి ఇది దోహదపడనుంది.



## అమిత్ షా వ్యాఖ్యల పై మమతా బెనర్జీ ఫైర్

- బెంగాల్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌లు విస్తరిస్తున్నాయన్న అమిత్ షా
- పహల్గాం, ఢిల్లీ వంటి ప్రాంతాల్లో ఉగ్రదాడులు ఎవరు చేశారో చెప్పాలన్న మమత
- బీజేపీ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపాటు

పెన్ పవర్ డెస్క్:బెంగాల్ రాజకీయాలు మరోసారి హాట్ టాపిక్‌గా మారా యి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో

వివరాలు 2లో..



## మందులకు కూడా లొంగని డెడ్లీ ఫంగస్... గతంలో కంటే ప్రాణాంతకం!

- ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న 'కాండిడా ఆరిస్' ఫంగస్
- చికిత్స అందించినా 50 శాతానికి పైగా మరణాలు
- చర్మంపై ఎక్కువ కాలం ఉంటూ ఇతరులకు వ్యాప్తి
- సాధారణ ల్యాబ్ పరీక్షల్లో గుర్తించడం కష్టం

పెన్ పవర్ డెస్క్:భారతీయ పరిశోధకుల నేతృత్వంలో జరిగిన ఓ తాజా అధ్యయనం ఆరోగ్య రంగంలో ఆందోళనకర విషయాలను వెల్లడించింది. డ్రగ్ రెసిస్టెంట్ (మందులకు లొంగని) ఫంగల్ జాతి 'కాండిడా ఆరిస్' ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోందని, ఇది గతంలో కంటే ప్రాణాంతకంగా మారుతోందని

వివరాలు 2లో..

## గ్రూప్-2 రిజర్వేషన్లపై పిటిషన్లు కొట్టివేసిన ఏపీ హైకోర్టు... నియామకాలకు లైన్ క్లియర్

- ఏపీ గ్రూప్-2 అభ్యర్థులకు భారీ ఊరట
- గ్రూప్-2 రిజర్వేషన్లపై హైకోర్టు కీలక తీర్పు
- రోస్టర్ పాయింట్లపై దాఖలైన అన్ని పిటిషన్లను తోసిపుచ్చిన ధర్మాసనం
- లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థులకు లభించిన భారీ ఊరట



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ గ్రూప్-2 అభ్యర్థులకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. గ్రూప్-2 నియామకాల్లో రిజర్వేషన్ రోస్టర్ పాయింట్లను సవాలు చేస్తూ దాఖలైన

వివరాలు 2లో..

### అనుకున్న దానికన్నా ముందుగానే
## దర్శనాలు ప్రారంభించాం


- శ్రీవారి ఆలయంలో ఘనంగా ప్రారంభమైన వైకుంఠ ఏకాదశి వేడుకలు
- ధనుర్మాస కైంకర్యాల అనంతరం అర్ధరాత్రి దాటాక వైకుంఠ ద్వార దర్శనాలు షురూ
- వైకుంఠ ద్వారం ద్వారా స్వామిని దర్శించుకున్న తెలంగాణ సీఎం



పెన్ పవర్ డెస్క్:తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వైకుంఠ ద్వార దర్శనాలు అత్యంత

వివరాలు 2లో..

## పుతిన్ నివాసంపై డ్రోన్ దాడి...
### తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన ప్రధాని మోదీ



- పుతిన్ నివాసంపై దాడి వార్తలు కలచివేసాయన్న మోదీ
- శాంతి చర్చలకు విఘాతం కలిగించే చర్యలు వద్దని హితవు
- 91 డ్రోన్లతో ఉక్రెయిన్ దాడి చేసిందన్న రష్యా
- ట్రంప్ మధ్యవర్తిత్వంతో కొలిక్కి వస్తున్న శాంతి చర్చలు
- యుద్ధం ముగింపు దశకు చేరుకుందన్న అమెరికా అధ్యక్షుడు

పెన్ పవర్ డెస్క్:రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నివాసం లక్ష్యంగా జరిగిన డ్రోన్ దాడుల పట్ల భారత ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. ప్రస్తుతం జరుగుతున్న దౌత్యపరమైన చర్చలే యుద్ధాన్ని ముగించి, శాంతిని స్థాపించడానికి సరైన మార్గమని స్పష్టం చేశారు. పుతిన్ నివాసంపై దాడి జరిగిందన్న వార్తలు తనను కలచివేశాయని, ఇలాంటి సమయంలో

వివరాలు 2లో..

## ఎమ్మెల్యే విరూపాక్షిని పరామర్శించిన జగన్



- రెండు మోకాళ్లకు శస్త్రచికిత్స చేయించుకున్న విరూపాక్షి
- విరూపాక్షికి ఫోన్ చేసి పరామర్శించిన జగన్
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన వైసీపీ అధినేత

పెన్ పవర్ డెస్క్:కర్నూలు జిల్లా ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని వైసీపీ అధినేత జగన్ సోమవారం నాడు పరామర్శించారు. హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో విరూపాక్షి రెండు మోకాళ్లకు శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ క్రమంలో, ఆయనకు జగన్ ఫోన్ చేసి పరామర్శించారు. ఆయన ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

### ఢిల్లీ గగనతలంపై సుదర్శన చక్రం.. శత్రువుల డ్రోన్లు,
## మిసైళ్లను నిర్వీర్యం చేయడమే లక్ష్యం


- ఢిల్లీ గగనతల భద్రతపై కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు
- రూ. 5,181 కోట్ల అంచనాతో సుదర్శన చక్రం
- గగనతల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ప్రత్యేక దృష్టి



పెన్ పవర్ డెస్క్:దేశ రాజధాని ఢిల్లీ గగనతల భద్రతను మరింత బలోపేతం చేయడంపై కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఢిల్లీలోని అత్యంత సున్నితమైన వీఐపీ-89 జోన్ పరిధిలో గగనతల రక్షణను కట్టుదిట్టం చేసేందుకు దేశీయంగా అభివృద్ధి చేసిన ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్స్ కొనుగోలుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా ఈ విషయాన్ని వెల్లడించింది.

వివరాలు 2లో..

## ప్రపంచంలోనే రెండో అతిపెద్ద రోడ్ నెట్‌వర్క్‌గా భారత్



- దేశంలో 1.46 లక్షల కిలోమీటర్లకు చేరిన జాతీయ రహదారులు
- 2014తో పోలిస్తే ఎక్స్‌ప్రెస్ వేల నిర్మాణంలో భారీ వృద్ధి
- ప్రమాద బాధితులకు దేశవ్యాప్తంగా ఉచిత వైద్య సాయం అమలు
- క్షతగాత్రులను ఆదుకునే వారికి రూ.25 వేల రివార్డు పెంపు

పెన్ పవర్ డెస్క్:గత 11 ఏళ్లలో భారతదేశం మౌలిక సదుపాయాల కల్పనలో, ముఖ్యంగా జాతీయ రహదారుల విస్తరణలో సరికొత్త చరిత్ర సృష్టించింది. దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల పొడవు 1,46,560 కిలోమీటర్లకు చేరడంతో, అమెరికా తర్వాత ప్రపంచంలోనే రెండో అతిపెద్ద రోడ్ నెట్‌వర్క్ కలిగిన దేశంగా భారత్ అవతరించింది. 2014లో 91,287 కిలోమీటర్లుగా ఉన్న జాతీయ రహదారులు, 2025 నాటికి ఏకంగా 61 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# డేటా కేంద్రాలు.. జనజీవనం అస్తవ్యస్తం!

'కృత్రిమ మేధ' విప్లవం భూగోళాన్ని వేగంగా కమ్ముకుంటోంది. దాన్ని బలోపేతం చేసేందుకు సాగుతున్న గ్లోబల్ పరుగులో అగ్రభాగాన నిలిచేందుకు ఇండియా చేస్తున్న ప్రయత్నంలో భాగంగా, అందుకవసరమైన భారీ డేటా సెంటర్ల నిర్మాణం కోసం రాష్ట్రాలు పోటీ పడుతున్నాయి. ఇప్పటికే నీటి కొరతలో కొట్టుమిట్టాడుతున్న ప్రాంతాల్లో డేటా సెంటర్లు నెలకొల్పుతున్నారు. దీనివల్ల దేశంలో డిజిటల్ బూమ్‌కు సమాంతరంగా నీటి కరవు తాండవిస్తుందనే ఆందోళనలు పెరుగుతున్నాయి. ఈ డిజిటల్ వికాసం జనజీవన వినాశనానికి దారితీస్తోంది. ఆసియాలో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిన ఇండియా అంతర్జాతీయ డేటా సెంటర్ల ఏర్పాటుకు కూడలిగా మారబోతోంది. ఆ క్రమంలో రాష్ట్ర పాలకులు, ప్రభుత్వం అభివృద్ధి పేరుతో చట్టాలు, నిబంధనలు పాటించని అనేక పరిశ్రమలను (రోగ్ ఇండిస్ట్రీస్) ప్రజల పన్నుల సొమ్ముతో అనేక రాయితీలు కల్పించి ఏర్పాటు చేస్తున్నారు. ప్రజా జీవనాన్ని, ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని ఫణంగా పెట్టి కార్పొరేట్ కేంద్రిత ఆర్థిక, ద్రవ్య విధానాలను కేంద్రం దన్నుతో అమలు చేస్తుండడం రాష్ట్ర ప్రజలకు శాపంగా పరిణమించనుంది. కాలుష్య కారక, కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను కలిగించే ఘన, ద్రవ, వాయు వ్యర్థాలను యథేచ్ఛగా వెదజల్లే ఫ్యాక్టరీలకు విచ్చలవిడిగా అనేక రుణాలు, సబ్సిడీలు, మౌలిక వసతుల కల్పనతో రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోవడమనే లక్ష్యంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం.. వాతావరణ ప్రతికూల ప్రభావాలను కల్గించే, ప్రాథమికంగా పెద్దఎత్తున విద్యుత్‌ను, నీటిని వినియోగిస్తూ, వేడిని, ఈ-వ్యర్థాలను వెదజల్లుతూ స్థానిక వనరులు ధ్వంసం చేసే, కర్బన ఉద్గారాలను అరాచకంగా వెదజల్లే.. నీటి కరువు, తీవ్ర శీతోష్ణస్థితి మార్పులు, మానసిక, శారీరక రుగ్మతలతో ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే.. అత్యంత ప్రమాదకరమైన ఈ కేంద్రాల నిర్మాణం క్షమించరాని దారుణం. 2030 నాటికి 6 గిగావాట్ సామర్థ్యంగల డేటా సెంటర్ల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే 7 డేటా సెంటర్లు రాష్ట్రంలో నడుస్తున్న వాటికి తోడుగా, వైజాగ్ కేంద్రంగా గూగుల్, రిలయన్స్, సిఫీ కార్పొరేట్ సంస్థలు పెద్ద ఎత్తున డేటా కేంద్రాలను నిర్మాణం చేపట్టనున్నాయి. అదే విధంగా విజయవాడ సమీపంలోని ఐ.టి పార్క్‌లో 60 మెగా వాట్ల సామర్థ్యంగల డేటా సెంటర్లను 'పై డేటా సెంటర్స్' అనే సంస్థ ఒక హబ్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ డేటా సెంటర్ల నిర్మాణం ద్వారా ఉపాధి అవకాశాలను కల్పిస్తామని, ఆర్థికాభివృద్ధిని తీసుకొస్తామని పాలకులు గోబెల్స్ ప్రచారం చేస్తూ ప్రజల్ని మభ్యపెడుతున్నారు.

ఇండియాలో డేటా సెంటర్ మార్కెట్ విజృంభిస్తోంది. 130-153 డేటా సెంటర్లు దేశవ్యాప్తంగా 31 ప్రాంతాల్లో విస్తరించడమే కాకుండా, రాబోయే కొన్ని సంవత్సరాల్లో ఆ సంఖ్య రెట్టింపు కావొచ్చుననే అంచనాలు జోరుగా సాగుతున్నాయి. మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఎన్.టి.టి గ్లోబల్ సెంటర్లు, టెలీ మీడియా గ్లోబల్, ఐరన్ మౌంటైన్, ఈక్వినాక్స్ అనే గ్లోబల్ డేటా సెంటర్ల ఆపరేటర్లు, కంట్రోల్ ఎస్, పై డేటా సెంటర్లు, బి.ఎస్.ఎన్.ఎల్ (నెక్ట్స్ జెనరేషన్ ఇన్ఫినైట్), వెబ్ వర్క్స్, ఎయిర్‌టెల్, అదానీ కనెక్స్, సిఫీ టెక్నాలజీలస్ అనే జాతీయ సంస్థలు డేటా సెంటర్లను నడుపుతున్నాయి. కొత్తగా గూగుల్ (అదానీ కనెక్స్ సహకారంతో), టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, రిలయన్స్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థలు కొత్తగా భారీ డేటా సెంటర్ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకున్నాయి. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రాయితీలతో అత్యంత ప్రమాదకర డేటా సెంటర్ల ఏర్పాటు కోసం పోటీ పడుతున్న వాటిలో ఆంధ్రప్రదేశ్ అగ్రభాగాన నిలిచేందుకు దారుణమైన రీతిలో ప్రజారోగ్యం, పర్యావరణం, ఆర్థిక వ్యవస్థలను ఫణంగా పెడుతోంది. సంప్రదాయ డేటా సెంటర్ ఏడాదికి 10-25 మెగావాట్ల విద్యుత్‌ను ఖర్చు చేస్తే, ఎ.ఐ తో నడిచే డేటా సెంటర్ ఏడాదికి 100 మెగావాట్ల విద్యుత్‌ను వినియోగిస్తుంది. ఇది ఒక లక్ష కుటుంబాలు ఏడాదికి వినియోగించే విద్యుత్‌కు సమానం. సర్వర్లు (60 శాతం), సమాచార నిల్వ వ్యవస్థలు (దాదాపు 5 శాతం), నెట్ వర్కింగ్ పరికరాల సంధానం (5 శాతం), ఐటీ పరికరాల వినియోగం (7-30 శాతం) విద్యుత్ వినియోగం పెద్ద ఎత్తున జరిగి స్థానిక విద్యుత్ వ్యవస్థకు పెద్ద అడ్డంకిగా మారుతుంది. విద్యుత్ వినియోగంలో అధిక భాగం ఉష్ణం (వేడి)గా మారుతుంది. దాంతో డేటా సెంటర్లను చల్లబరచవలసి ఉంటుంది. అందుకోసం చల్లగాలి జనరేటర్లను వాడుతున్నప్పటికీ, ప్రధానంగా ఆ ఉష్ణాన్ని నీటి ద్వారా తొలగించడం పరిపాటి. ఒక మెగావాట్ డేటా సెంటర్ కోసం ఏడాదికి 26 మిలియన్ల (రెండు కోట్ల అరవై లక్షల) లీటర్లను వినియోగించాల్సి వస్తుంది. 30 మెగావాట్ల డేటా సెంటర్ కోసం ఏడాదికి 780 మిలియన్ లీటర్ల (అంటే రోజుకు 2,19,700 లీటర్ల) నీటిని వినియోగించాలి. ఇండియాలో పట్టణ ప్రాంతాల్లో రోజుకు తలసరి 135 లీటర్ల నీరు అవసరం. అందువల్ల రోజుకు 1630 మందికి అవసరమయ్యే నీటిని ఖర్చు చేయవలసి వస్తుంది. గూగుల్ 1 గిగావాట్ (వెయ్యి మెగావాట్లు), రిలయన్స్ 1 గిగావాట్, సిఫీ-500 మెగావాట్లు, మెటా-500 మెగావాట్లు, పై-60 మెగావాట్ల లక్ష్యంగా డేటా సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 6 గిగావాట్ సామర్థ్యం గల డేటా సెంటర్లు 2030 నాటికి రాబోతున్నాయి. అంటే, రోజుకు 4,39,40,000 లీటర్లకు పైగా నీటిని డేటా సెంటర్లు వినియోగించబోతున్నాయి. దాంతో డేటా సెంటర్లున్న ప్రాంతాలలో పెద్ద ఎత్తున తాగు/సాగు నీటి కొరత ఏర్పడి ప్రజా జీవనాన్ని అల్లకల్లోలంగా మార్చుతుంది. 2024లో గ్లోబల్ విద్యుత్ వినియోగంలో 1.5 శాతంగా ఉన్న డేటా సెంటర్ల విద్యుత్ వినియోగం, గత ఐదేళ్లలో ఏడాదికి 12 శాతం చొప్పున పెరిగింది. అదే సమయంలో ఇప్పటికీ విద్యుత్ ఉత్పత్తిలో బొగ్గు వినియోగం 30 శాతం, గ్యాస్ 26 శాతం, అణు శక్తి 15 శాతంగా ఉంది. డేటా సెంటర్లు 27 శాతం విద్యుత్తును ఖర్చు చేస్తుండడంతో, అది మరింత వేగంగా పెరుగుతుండడం, ఇతర పారిశ్రామిక, ప్రజా అవసరాల కోసం గ్లోబల్ విద్యుదుత్పత్తిని పెంచక తప్పని పరిస్థితి. ఇప్పటికే శిలాజ ఇంధనాల నుంచి వెలువడుతున్న హరిత వాయువులను తగ్గించుకోలేని పరిస్థితి కొనసాగుతుండగా, ఈ డేటా సెంటర్ల వల్ల కర్బన ఉద్గారాలు మరింతగా పెరిగే దుస్థితి ఏర్పడుతుంది. పెరుగుతున్న భూతాపాన్ని తగ్గించే లక్ష్యంతో వివిధ దేశాలు కార్బన్ క్రెడిట్ల లక్ష్యం కోసం అణు విద్యుత్‌పై ఆధారపడవలసిన పరిస్థితి. రాబోయే డేటా సెంటర్ల విద్యుత్ అవసరాలను తీర్చే ఉద్దేశంతో పౌర అణు విద్యుత్ రంగంలోకి ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలను అనుమతించేందుకు కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకొంది. లాభాల కోసం ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు (భోపాల్ గ్యాస్ మారణహోమం ఉదంతం) ప్రాణాంతక అణు విద్యుత్ ఉత్పత్తి రక్షణ నియమాలను తుంగలోకి తొక్కి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అత్యధిక విద్యుత్ వినియోగం, భారీగా నీటి వినియోగం, పెద్దఎత్తున డేటా సెంటర్ పరిసరాల్లో ఉష్ణం వ్యాపించడం, ప్రమాదకరమైన ఈ వ్యర్థాలు అనూహ్యమైన స్థాయిలో ఉత్పత్తి కావడం, భరించలేని శబ్ద కాలుష్యం, పర్యావరణ, ప్రజారోగ్య సమస్యలు తలెత్తడం, ఉపాధి కల్పన పరిమితంగా వుండడంతో అమెరికాలో ప్రజలు డేటా సెంటర్ల నిర్మాణానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమించారు. దానివల్ల దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో 64 బిలియన్ డాలర్లు పైగా మదుపుతో పెట్టబోయే డేటా సెంటర్ల నిర్మాణం రద్దయింది. అయితే ప్రజా ఉద్యమాల ధాటికి ఉత్పత్తి, ఖర్చును మించిన వ్యర్థాల పరిరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయవలసి వస్తుంది. దీంతో లాభాల మార్జిన్ల కోసం అలాంటి 'రోగ్' పరిశ్రమలను బహుళజాతి సంస్థలు దక్షిణాది వ్యవసాయ దేశాలకు, పేద దేశాలకు తరలిస్తాయి. వెనుకబడిన, వర్ధమాన దేశాల ప్రజలకు ఆయా సంస్థల వల్ల కలిగే దుష్ప్రభావాల గురించిన సమాచారం కొరవడడం, ప్రభుత్వాలు, పాలక వర్గాలు వ్యర్థ నియంత్రణ వ్యవస్థల ఏర్పాటును పెద్దగా పట్టించుకోక పోవడం వంటివి ఇలాంటి పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితి కల్పిస్తుంది. పైగా రాష్ట్ర పాలకులు పెద్ద ఎత్తున విదేశీ మదుపులను ఆకర్షిస్తున్నట్లుగా, అభివృద్ధి, ఉపాధి కల్పన, ఆర్థిక వికాసాన్ని తీసుకొస్తున్నట్లుగా ఫోజులు కొట్టేందుకు అవకాశం ఉంటుంది. ప్రజారోగ్యాన్ని, వ్యవసాయ-పారిశ్రామిక రంగాలను, పర్యావరణాన్ని ధ్వంసం చేసే డేటా సెంటర్లు, ఇథనాల్ ఫ్యాక్టరీలు, పెట్రో కెమికల్ రసాయనాల తయారీ, అణు విద్యుత్ కేంద్రాల ఏర్పాటు, సోలార్ ప్యానల్ తయారీ ఫ్యాక్టరీ తదితర 'రోగ్ ఫ్యాక్టరీ'ల ఏర్పాటుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రయత్నాలను ప్రజలు సంఘటితంగా తిప్పికొట్టవలసిన తరుణమిది. తస్మాత్ జాగ్రత్త.

# అద్దంకి, కందుకూరు ప్రజల ఆకాంక్ష నెరవేరింది

- మొదటి పేజి తరువాయి

కందుకూరు, అద్దంకి ప్రాంతాలను ప్రకాశం జిల్లాలో తిరిగి విలీనం చేయడం శుభపరిణామమన్నారు. ముఖ్యంగా 2012 నుంచి అద్దంకి ప్రాంత ప్రజలు తమ రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం, పాలనా సౌలభ్యం కోసం రెవెన్యూ డివిజన్ కావాలని కోరుతున్నారని, వారి విజ్ఞప్తిని మన్నించి అద్దంకిని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఇన్నాళ్లు బాపట్ల జిల్లా పరిధిలో ఉండటం వల్ల అద్దంకి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, తాజా నిర్ణయంతో ఆ కష్టాలు తీరనున్నాయని వివరించారు.

**దుర్గగుడిలో అంతరాయంపై వివరణ**

ఇటీవల విజయవాడ కనకదుర్గ ఆలయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంపై మంత్రి స్పష్టత ఇచ్చారు. ఇది కేవలం అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా జరిగిన ఘటన అని, విద్యుత్ సరఫరాలో సాంకేతిక లోపాలు లేవని స్పష్టం చేశారు. కరెంట్ కేవలం 10 నిమిషాలు మాత్రమే నిలిచిపోయిందని, విషయం తెలిసిన వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులైన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు జనవరి 6 లేదా 7 తేదీల్లో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఈవో, ఇతర ముఖ్య అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ చిన్న పొరపాటును ఆసరాగా చేసుకుని రాజకీయ విమర్శలు చేయడం తగదని వైసీపీ నేతలకు హితవు పలికారు. ప్రజల మనోభావాలతో ముడిపడిన అంశాలపై అనవసర రాద్ధాంతం చేయడం, ప్రతి సాధారణ విషయాన్ని రాజకీయాలకు వాడుకోవడం వైసీపీ నాయకులకు అలవాటుగా మారిపోయిందని మంత్రి మండిపడ్డారు. ఏ ధర్మాన్నైనా, సంప్రదాయాలనైనా చిత్తశుద్ధితో కాపాడేది ఒక్క కూటమి ప్రభుత్వమేనని గొట్టిపాటి రవికుమార్ ఉద్ఘాటించారు.

# గ్రూప్-2 రిజర్వేషన్లపై పిటిషన్లు కొట్టివేసిన ఏపీ హైకోర్టు... నియామకాలకు లైన్ క్లియర్

- మొదటి పేజి తరువాయి

పిటిషన్లన్నింటినీ ఏపీ హైకోర్టు కొట్టివేసింది. మంగళవారం వెలువడిన ఈ తీర్పుతో గత కొంతకాలంగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. ఈ నిర్ణయం లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపశమనం కలిగించింది. 2023లో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) జారీ చేసిన గ్రూప్-2 నోటిఫికేషన్‌పై పలువురు అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రధానంగా మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికులు (ఎక్స్-సర్వీస్‌మెన్), క్రీడాకారులకు కేటాయించిన ప్రత్యేక రిజర్వేషన్ పాయింట్లు నిబంధనల ప్రకారం లేవని పిటిషనర్లు ఆరోపించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రిజర్వేషన్ రోస్టర్‌ను సరిచేసి, పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసి కొత్తది జారీ చేయాలని కోరారు. దీనిపై సమగ్ర విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం.. పిటిషనర్ల వాదనలను తోసిపుచ్చుతూ తీర్పు వెలువరించింది. అన్ని పిటిషన్లను కొట్టివేయడంతో నియామక ప్రక్రియకు మార్గం సుగమమైంది. ఇప్పటికే గ్రూప్-2 ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు పూర్తయిన నేపథ్యంలో, ఈ తీర్పు అభ్యర్థుల్లో కొత్త ఆశలు రేకెత్తించింది. రోస్టర్ పాయింట్ల వివాదంతో నియామకాలు ఎక్కడ ఆగిపోతాయోనని ఆందోళన చెందుతున్న అభ్యర్థులకు ఈ తీర్పు ఊరటనిచ్చింది. న్యాయపరమైన చిక్కులు తొలగిపోవడంతో ఏపీపీఎస్సీ తదుపరి నియామక ప్రక్రియను వేగవంతం చేసే అవకాశం ఉంది.

# అనుకున్న దానికన్నా ముందుగానే దర్శనాలు ప్రారంభించాం

- మొదటి పేజి తరువాయి

వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12:05 గంటలకు వైకుంఠ ద్వారాన్ని తెరిచి భక్తులకు అనుమతినిచ్చారు. ముందుగా ఆలయంలో ధనుర్మాస కైంకర్యాలు, ప్రత్యేక హారతులు, నివేదనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆలయ జీయంగార్లు, అర్చకులు, టీటీడీ అధికారులు, పాలకమండలి సభ్యులు సంప్రదాయబద్ధంగా వైకుంఠ ద్వార ప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు స్పందిస్తూ... "అనుకున్న సమయం కంటే ముందుగానే భక్తుల కోసం దర్శనాలు ప్రారంభించాం. ఎక్కడా చిన్న ఇబ్బంది కూడా కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం" అని వెల్లడించారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి వైకుంఠ ద్వారం గుండా నడిచి స్వామివారి ఆశీస్సులు పొందారు. సీఎం రేవంత్‌కు ఆలయ మహాద్వారం వద్ద టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. అలాగే పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రముఖులు కూడా స్వామివారి సేవలో పాల్గొన్నారు.

ఈ వైకుంఠ ద్వార

దర్శనాలు జనవరి 8 వరకు మొత్తం 10 రోజుల పాటు కొనసాగుతాయి. తొలి మూడు రోజులు కేవలం టోకెన్లు ఉన్నవారికే అనుమతి ఉంటుందని, జనవరి 2 నుంచి సాధారణ భక్తులకు కూడా అవకాశం కల్పిస్తామని టీటీడీ వర్గాలు తెలిపాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని లడ్డూ ప్రసాదం, అన్నదానం, ట్రాఫిక్ నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

# పుతిన్ నివాసంపై డ్రోన్ దాడి... తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన ప్రధాని మోదీ

- మొదటి పేజి తరువాయి

శాంతి చర్చల ప్రక్రియకు విఘాతం కలిగించేలా ఏ పక్షం కూడా వ్యవహరించకూడదని మోదీ సూచించారు. అందరూ చర్చలపైనే దృష్టి సారించాలని ఆయన కోరారు. రాత్రి వేళ, పుతిన్ ఉంటున్న నొవొగొరోడ్ ప్రాంతంపై ఉక్రెయిన్ 91 లాంగ్ రేంజ్ డ్రోన్లతో విరుచుకుపడిందని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ ఆరోపించారు. దీనిని ఉగ్రవాద చర్యగా ఆయన అభివర్ణించారు. అయితే రష్యా వైమానిక రక్షణ వ్యవస్థలు వాటన్నింటినీ కూల్చివేశాయని, ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరగలేదని 'టాస్' వార్తా సంస్థ వెల్లడించింది. ఉక్రెయిన్ దాడికి రష్యా తగిన సమాధానం చెబుతుందని లావ్రోవ్ హెచ్చరించారు. మరోవైపు రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆయన ఆదివారం పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడగా, ఫ్లోరిడాలోని తన నివాసంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. ఈ చర్చలు చాలా సానుకూలంగా సాగాయని, యుద్ధం ముగింపు దశకు చాలా దగ్గరగా ఉందని ట్రంప్ వెల్లడించారు. ఇలాంటి కీలక సమయంలో దాడులు జరగడం అంతర్జాతీయంగా ఆందోళన రేకెత్తిస్తోంది.

# ప్రపంచంలోనే రెండో అతిపెద్ద రోడ్ నెట్‌వర్క్‌గా భారత్

- మొదటి పేజి తరువాయి

అగ్రరాజ్యం అమెరికా జాతీయ రహదారుల నెట్ వర్క్ విషయంలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది.

ముఖ్యంగా భారత్ మాల పరియోజన వంటి పథకాల ద్వారా భారత్ లో హైవేల రూపురేఖలు మారిపోయాయి. 2014లో కేవలం 93 కిలోమీటర్లుగా ఉన్న యాక్సెస్-కంట్రోల్డ్ హైస్పీడ్ కారిడార్లు, ఎక్స్‌ప్రెస్ వేలు ప్రస్తుతం 3,052 కిలోమీటర్లకు పెరిగాయి. అలాగే నాలుగు లేన్ల రహదారులు 18 వేల కిలోమీటర్ల నుంచి 43,512 కిలోమీటర్లకు రెట్టింపయ్యాయి. రాబోయే మూడేళ్లలో మరో రూ.8.3 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. సామాన్య ప్రజలకు ఊరటనిచ్చేలా భద్రతా ప్రమాణాల్లోనూ కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రోడ్డు ప్రమాద బాధితులకు 'క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ స్కీమ్' ద్వారా రూ.1.5 లక్షల వరకు ఉచిత వైద్య సాయం అందించేలా చర్యలు తీసుకున్నారు. అలాగే ప్రమాద సమయంలో సాయం చేసే వారికి (గుడ్ సమారిటన్) ఇచ్చే పారితోషికాన్ని రూ.5 వేల నుంచి రూ.25 వేలకు పెంచారు. రవాణా రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు 2026 జనవరిలో పబ్లిక్ ఇన్విట్ (%×అజ×ు%)ను తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. హైడ్రోజన్ ట్రక్కుల ప్రయోగాలు, ఫాస్టాగ్ ఆధారిత టోలింగ్ వంటి ఆధునిక సాంకేతికతతో భారత రవాణా రంగం కొత్త పుంతలు తొక్కుతోంది.

# అమిత్ షా వ్యాఖ్యల పై మమతా బెనర్జీ ఫైర్

- మొదటి పేజి తరువాయి

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బెంగాల్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌లు విస్తరిస్తున్నాయంటూ అమిత్ షా వ్యాఖ్యానించడం పూర్తిగా రాజకీయ ప్రేరితమని మమత మండిపడ్డారు. బెంగాల్‌లోనే ఉగ్రవాదులు ఉంటే, పహల్గాం, ఢిల్లీ వంటి ప్రాంతాల్లో జరిగిన ఉగ్రదాడులు ఎవరు చేశారో చెప్పాలని ఆమె సూటిగా ప్రశ్నించారు. అలాగే, బెంగాల్ ప్రభుత్వం భూమి ఇవ్వకపోవడం వల్లే సరిహద్దుల్లో కంచె నిర్మాణం జరగడం లేదన్న అమిత్ షా వ్యాఖ్యలను కూడా మమత తీవ్రంగా ఖండించారు. పెట్రాపోల్, చంగ్రబంధ సరిహద్దుల్లో ఇప్పటికే తమ ప్రభుత్వం అవసరమైన భూమిని కేంద్రానికి అప్పగించిందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సహకరించడంవల్లే అనేక రైల్వే ప్రాజెక్టులు బెంగాల్‌కు వచ్చాయని గుర్తు చేశారు. బీజేపీ నేతలు కావాలనే అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, అలాంటి మాటలను బెంగాల్ ప్రజలు ఎప్పటికీ నమ్మరని మమత స్పష్టం చేశారు. ఇక ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం 'ఎస్ఐఆర్' పేరుతో రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకు కుట్ర పన్నుతోందని మమత తీవ్ర ఆరోపణలు చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఇంత హడావిడిగా ఎందుకు చేపడుతున్నారని కేంద్రాన్ని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేక పలువురు బూత్ లెవల్ అధికారులు, ఇతర సిబ్బంది మానసిక ఒత్తిడితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో సుమారు 1.5 కోట్ల మంది పేర్లను తొలగించేందుకు ప్రయత్నం జరుగుతోందని మమత ఆరోపించారు. ముఖ్యంగా ఆదివాసీలు, అణగారిన వర్గాలను లక్ష్యంగా చేసుకుని ఈ ప్రక్రియను నడుపుతున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ఇలాంటి చర్యలను తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని, బెంగాల్ ప్రజల హక్కుల కోసం చివరి వరకు పోరాడతామని మమతా బెనర్జీ స్పష్టం చేశారు.

# మందులకు కూడా లొంగని డెడ్లీ ఫంగస్... గతంలో కంటే ప్రాణాంతకం!

- మొదటి పేజి తరువాయి

హెచ్చరించింది. ఢిల్లీలోని వల్లభ్‌భాయ్ పటేల్ చెస్ట్ ఇన్‌స్టిట్యూట్, అమెరికాకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ (ఎన్ఐహెచ్) సంయుక్తంగా ఈ అధ్యయనాన్ని నిర్వహించాయి. ఈ ప్రమాదకరమైన ఫంగల్ ఇన్ఫెక్షన్లు ఏటా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 65 లక్షల మందిపై ప్రభావం చూపుతున్నాయని పరిశోధకులు తెలిపారు. దీని తీవ్రత ఎంతలా ఉందంటే.. యాంటీ ఫంగల్ చికిత్స అందించినప్పటికీ మరణాల రేటు 50 శాతానికి పైగా ఉంటోందని పేర్కొన్నారు. ఇది బహుళ ఔషధాలను తట్టుకునే శక్తిని కలిగి ఉండటం వైద్యులను కలవరపెడుతోంది. కాండిడా ఆరిస్ మానవ చర్మంపై ఎక్కువ కాలం జీవించి ఉండగలదని, అక్కడి నుంచి శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపిస్తుందని నిపుణులు వివరించారు. ఇది ఈస్ట్ నుంచి ఫిలమెంట్‌గా రూపం మార్చుకోవడం, కణాల సమూహాలను ఏర్పరచుకోవడం వంటి కణ స్థాయి వ్యూహాలతో మనుగడ సాగిస్తోందని 'మైక్రోబయాలజీ అండ్ మాలిక్యులర్ బయాలజీ రివ్యూస్' జర్నల్‌లో ప్రచురితమైన నివేదిక పేర్కొంది. చర్మంపై, అలాగే నిర్జీవ ప్రదేశాలపై కూడా ఇది గమ్ లాగా అతుక్కుపోతుందని తెలిపారు. దీనివల్ల ఆసుపత్రుల్లో చేరిన రోగుల నుంచి ఇతరులకు ఈ ఫంగస్ సులభంగా వ్యాపించే ముప్పు ఉందని హెచ్చరించారు. మరోవైపు, సాధారణ ల్యాబ్ పరీక్షల్లో ఈ ఫంగస్‌ను గుర్తించడం కష్టమని, తరచుగా దీనిని వేరే ఈస్ట్‌గా పొరబడే అవకాశం ఉందని, దీనివల్ల చికిత్స ఆలస్యమవుతోందని పరిశోధకులు వివరించారు. ఈ విపత్తును ఎదుర్కోవడానికి కొత్త రకం యాంటీ ఫంగల్ మందులు, మెరుగైన వ్యాక్సిన్లు, అధునాతన డయాగ్నస్టిక్ పరీక్షలు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు సూచించారు.

# ఢిల్లీ గగనతలంపై సుదర్శన చక్రం.. శత్రువుల డ్రోన్లు, మిస్సైళ్లను నిర్వీర్యం చేయడమే లక్ష్యం

- మొదటి పేజి తరువాయి

ఈ గగనతల రక్షణ వ్యవస్థను 'సుదర్శన చక్ర %-% ఫర్ ఢిల్లీ' అనే ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా దేశ రాజధాని చుట్టూ సుమారు 30 కిలోమీటర్ల పరిధిలో ఎటువంటి గగనతల ముప్పు ఎదురైనా వెంటనే గుర్తించి, అడ్డుకునే సామర్థ్యం ఈ వ్యవస్థకు ఉంటుంది. డ్రోన్లు, మిసైళ్లు, శత్రు యుద్ధవిమానాల నుంచి వచ్చే ప్రమాదాలను ముందే గుర్తించి నిర్వీర్యం చేయడమే దీని ప్రధాన లక్ష్యం. ఈ అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను డీఆర్‌డీవో స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసింది. దీని అంచనా వ్యయం సుమారు రూ.5,181 కోట్లుగా పేర్కొంటున్నారు. ఇటీవల కాలంలో డ్రోన్ల ద్వారా దాడులు, గగనతల ముప్పులు పెరుగుతున్న నేపథ్యంలో దేశ రాజధాని భద్రతపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

ఇదిలా ఉండగా, భారత సైనిక సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణ మంత్రిత్వశాఖ తాజాగా రూ.79 వేల కోట్ల విలువైన ఆయుధ సామగ్రి కొనుగోళ్లకు ఆమోదం తెలిపింది. ఈ పెద్ద ప్యాకేజీలో భాగంగానే ఢిల్లీకి సంబంధించిన ఈ గగనతల రక్షణ వ్యవస్థకు కూడా అంగీకారం తెలిపినట్లు సమాచారం.

గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోనే ప్రధాని నరేంద్ర మోదీ 'సుదర్శన చక్ర' వ్యవస్థ గురించి ప్రస్తావించారు. దేశంలోని వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతాలు, పౌర కేంద్రాలు, జాతీయ ప్రాముఖ్యత కలిగిన ప్రాంతాలను గగనతల దాడుల నుంచి రక్షించేలా బహుళ అంచెల రక్షణ కవచాన్ని ఏర్పాటు చేయడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యమని అప్పుడే ప్రకటించారు. ఈ వ్యవస్థలో భాగంగా శత్రు క్షిపణులు, యుద్ధవిమానాలను గుర్తించే అధునాతన రాడార్ వ్యవస్థలు, వాటిని మధ్యలోనే కూల్చివేసే ఇంటర్‌సెప్టర్లు, అలాగే సైబర్ యుద్ధాన్ని ఎదుర్కొనే సామర్థ్యం కూడా ఉండనుంది. డీఆర్‌డీవో, ప్రైవేట్ రక్షణ సంస్థలు, భారత సైన్యం కలిసి ఈ భారీ ప్రాజెక్ట్‌ను అమలు చేయడానికి ఇప్పటికే ప్రాథమిక సన్నాహాలు ప్రారంభించినట్లు సమాచారం. మొత్తంగా చూస్తే, ఢిల్లీ గగనతల భద్రతను ఇనుమడింపజేసే దిశగా సుదర్శన చక్ర ప్రాజెక్ట్ దేశ రక్షణ రంగంలో మరో కీలక మైలురాయిగా నిలవనుందని రక్షణ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తూ జీవో జారీ - జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు



**కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ డిసెంబర్ 30**

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 29వ తేదీన జరిగిన రాష్ట్ర క్యాబ్ నేట్లో ఏపీ జిల్లాల పునర్విభజన ప్రతి పాదనలకు ఆమోదం తెలపడంతో నూతనంగా మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తూ మంగళవారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ జిఓ ఎంఎస్. నెం.524ను జారిచేసినట్లు జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు నేడొక ప్రకటనలో తెలిపారు. మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్లగా, 21 మండలాలతో ఈనెల 31వ తేదీ నుండి నూతనంగా మార్కాపురం జిల్లా ఏర్పాటు కానున్నట్లు ఆయన తెలిపారు. మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డు గల రిహబిటేషన్ అండ్ రీ సెటిల్మెంట్ కాలనీలో గల భవనంలో ఈనెల 31వ తేదీ నుండి మార్కాపురం జిల్లా కలెక్టర్ వారి కార్యాలయాన్ని ఏర్పాటుచేసుకొని పరిపాలనా వ్యవహారాలు నిర్వహించాలని ఉత్తర్వులు జారి చేసినట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

పెన్ పవర్
ప్రకాశం

# కార్యకర్తలే తెలుగుదేశం పార్టీ బలం

- కార్యకర్తలే నా కుటుంబం
- వారి కష్టంతోనే ఈ స్థాయికి వచ్చా
- ప్రతి ఒక్కరికీ న్యాయం చేసే బాధ్యత నాది
- సమస్య వస్తే చిన్న మెసేజ్ చేయండి - వెంటనే స్పందిస్తా
- నాయకత్వ లక్షణాలను పెంచుకొని పార్టీని మరింత బలపరచండి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయాలి
- కార్యకర్తలకు పిలుపునిచ్చిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు
- ఉత్తమ కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు పంపిణీ

**కందుకూరు పెన్ పవర్, డిసెంబర్ 30:**

తెలుగుదేశం పార్టీ బలం అండ కార్యకర్తలే అని, కార్యకర్తల కష్టంతోనే తాను ఎమ్మెల్యే స్థాయికి ఎదిగానని, ఆ విషయాన్ని తాను ఎప్పటికీ మరిచిపోనని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. కష్ట కాలంలో తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరినీ గుర్తుపెట్టుకుని వారికి అండగా నిలుస్తానని స్పష్టం చేశారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా పార్టీకి సేవలందించిన నియోజకవర్గంలోని 80 మంది ఉత్తమ కార్యకర్తలకు మంగళవారం ఆయన ప్రశంస పత్రాలను ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. వారందరినీ పేరుపేరునా అభినందించారు.

టిడిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు జరిగిన అనేక సంఘటనలను గుర్తు చేసుకున్నారు. తాను ఇంచార్జ్ గా వచ్చిన తర్వాత అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నానని, తనను ప్రతిష్ట పాలు చేసేందుకు ప్రయత్నాలు జరిగాయని అన్నారు. ఆ సందర్భంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తనకు అండగా నిలిచారని తెలిపారు. ప్రజలు కూడా తనపై విశ్వాసంతో, కందుకూరు చరిత్రలో ఎవరికీ ఇవ్వనంత మెజారిటీ ఇచ్చారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తనకు ముఖ్యమన్నారు.





కార్యకర్తలు కేవలం కార్యకర్తలు గానే మిగిలిపోకుండా, నాయకత్వ లక్షణాలతో ముందుకు సాగితే, పదవులు వాటి అంతట అవే వెతుక్కుంటూ వస్తాయని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. ఉత్తమ కార్యకర్తలుగా ప్రశంసా పత్రాలు అందుకున్న వారంతా గత ఎన్నికల్లో, తర్వాత సోషల్ మీడియా ద్వారా పార్టీకి మంచి సేవలు అందించారని అన్నారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు చిన్న మెసేజ్ చేసినా వెంటనే స్పందిస్తానని ఎమ్మెల్యే నాగేశ్వరరావు కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఇక కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపి ప్రక్రియ పూర్తయిందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు వెల్లడించారు. ప్రజల ఇబ్బందులను గమనించి సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూటమి పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కందుకూరులో నెల్లూరు జిల్లాలో కలపడానికి వ్యతిరేకిస్తూ, టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారని , వారందరిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. కందుకూరు నియోజవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టామని, ప్రధానంగా కందుకూరు పట్టణంలో సుమారు ఐదున్నర కోట్ల రూపాయలతో డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు.



మున్సిపాలిటీ అభివృద్ధికి పురపాలక శాఖ మంత్రి నారాయణ అందిస్తున్న సహకారం మరువలేనిదని ఎమ్మెల్యే అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో నియోజకవర్గంలో సి.సి రోడ్ల నిర్మాణానికి 11 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సత్తా చూపాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. అన్ని పంచాయతీలు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, ఎంపీపీ స్థానాలను అధికార ప్రభుత్వం కైవసం చేసుకునేలా కష్టపడాలని సూచించారు. తద్వారా 2029 ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కందుకూరు పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల టిడిపి అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, లింగసముద్రం మండల టిడిపి పార్టీ అధ్యక్షులు పూరిమెట్ల గురునాథం, గుడ్లూరు మండల టిడిపి పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధుబాబు, పార్టీ నాయకులు చదలవాడ కొండయ్య, బెజవాడ ప్రసాద్, అనుబంధ సంఘాల అధ్యక్షులు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీగిరిలో ఘనంగా ముక్కోటి వేడుకలు

*- వేల సంఖ్యలో శ్రీవారిని దర్శించుకున్న భక్తులు*

*- సతీసమేతంగా శ్రీవారిని దర్శించుకున్న ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్*





**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు డిసెంబర్ 30**

ముక్కోటి వేళ శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం మంగళ వారం భక్తజనంతో కిటకిటలాడింది. అన్ని దారులు శ్రీగిరికే అన్నట్లు వేల సంఖ్యలో భక్తులు తెల్లవారుజాము నుండే తమ ఇష్ట దైవం శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో క్యూ లైన్లలో బారులు తీరారు. గోవిందా గోవింద! అంటూ భక్తులు తన్మయత్వంతో పిలిచే పిలుపులతో శ్రీగిరి ప్రతిధ్వనించింది. వైకుంఠ ఏకాదశి ముక్కోటి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు, ఉభయ దేవేరులతో కూడి కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీగిరిలో నూతనంగా ప్రవేశ పెట్టిన శీఘ్ర దర్శనం పథకం విజయవంతమైంది. శ్రీగిరి మెట్ల మార్గం ద్వారా కూడా భక్తులు శ్రీగిరికి చేరుకున్నారు. ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ సతీ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. ఒంగోలు నగర కమిషనర్ డాక్టర్ కే. వెంకటేశ్వర రావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పలు రంగాల ప్రముఖులు శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సివి రామ కృష్ణ రావు, ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి తదితరులతో పాటు ఆలూరు జై శంకర్, ధర్మకర్తల మండలి ప్రతినిధులు తదితరులు పర్యవేక్షించారు. భక్తులకు శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

# పత్రిక ప్రజల పక్షాన నిలిచింది





**పెద్దదోర్నాల పెన్ పవర్ డిసెంబర్ 30**

పత్రిక ప్రపంచంలో 11వసంతాలు పూర్తిచేసుకున్న పెన్ పవర్ దిన పత్రిక అన్ని వర్గాలను ఆకట్టుకుని, ప్రజల పక్షాన నిలిచిందని వైస్సార్సీపీ మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి అన్నారు, మంగళవారం మండల కేంద్రంలోని ఆయన కార్యాలయంలో నూతన సంవత్సరపెన్ పవర్ క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ గంట వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ పెన్ పవర్ పత్రికలో వాస్తవమైన వార్తలు, మానవీయ కదనాలు, ప్రచురతం కావడం పాఠకులను ఆకట్టుకుందని అన్నారు. పత్రిక మరింత అభ్యున్నతికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ - నియోజకవర్గ వైస్సార్సీపీ మైనారిటీ సెల్ అధ్యక్షులు రసూల్, వి రమణయ్య, పెన్ పవర్ జర్నలిస్ట్ రామారావు, ఆంధ్రప్రభ జర్నలిస్ట్ వెంకటేశ్వరరెడ్డి, స్వతంత్ర జర్నలిస్ట్ గాలిరెడ్డి, వైకే టీవీ జర్నలిస్ట్ ప్రశాంత్. రాజారపు కాశి రాములు. తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సమస్యల పరిష్కారానికి శ్రద్ధ చూపాలి

*- జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు*






**కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ డిసెంబర్ 30**

ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికలో అత్యధికంగా రెవెన్యూ సమస్యలపై అర్జీలు వస్తున్న నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో రెవెన్యూ అధికారులు రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రెవెన్యూ అంశాలు, కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, రేషన్ షాపుల తనిఖీలు, దీపం.2 పథకం అమలు, ధాన్యం సేకరణ, రెవెన్యూ రాబడి, నీటి ఆడిటింగ్, నీటి బడ్జెట్. భూగర్భ జలాల వాస్తవ తనిఖీ, నీటి వనరుల విశ్లేషణ, కేంద్ర ప్రాయోజిత పథకాల పనుల పురోగతి, గృహ నిర్మాణాల పురోగతి తదితర అంశాలపై సమీక్షించి తగు సూచనలు, ఆదేశాలు జారీ చేసారు. తొలుత రెవెన్యూ అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్షిస్తూ, ప్రజాసమస్యల పరిష్కారానికి ముఖ్యంగా రెవెన్యూ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. అందులో భాగంగా ఈ నెల 29వ తేదీ నుండి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ క్లీనిక్ ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. క్షేత్ర స్థాయిలో రెవెన్యూ అధికార యంత్రాంగం కూడా అదే దృక్పథంతో వ్యవహరించాలన్నారు. పిజిఆర్ఎస్ కార్యక్రమానికి వస్తున్న అర్జీలలో సుమారు 70 శాతం మేర రెవెన్యూ సంబంధిత అంశాలపైనే వస్తుంటాయని, సంబంధిత రెవెన్యూ అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత గడువులోపు వచ్చిన ఆర్జీల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యల పరిష్కారం కోసం అధికారుల వద్దకు వచ్చే ప్రజలతో మర్యాదగా ప్రవర్తించడమే కాక, వారి సమస్యను సావధానంగా విని నిబంధనల మేరకు సానుకూల విధానంలో పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. రెవెన్యూ సమస్యలపై అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులు పరిశీలన చేసినప్పుడే సంబంధిత సమస్య నాణ్యతతో పరిష్కరించేలా వీలౌతుందన్నారు. సమస్య పరిష్కారం అయిన తరవాత పరిష్కార విధానం, దరఖాస్తుదారుల సంతృప్తి చెందారా.. లేదా అన్న విషయాన్నీ అధికారులు స్వయంగా ఫోన్ చేసి తెలుసుకోవాలని, అప్పుడే ప్రభుత్వ సేవలపై ప్రజలకు అనుకూల అభిప్రాయం ఏర్పడుతుందన్నారు. అనంతరం పౌర సరఫరాల విభాగం పై సమీక్షిస్తూ, జిల్లా లోని అన్నీ మండలాల్లో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. గ్యాస్ పంపిణీ, రేషన్ పంపిణీలలో వినియోగదారులతో ఐవిఆర్ఎస్ ద్వారా వచ్చే వారి అభిప్రాయాలు తీసుకుంటామని, ఏ వినియోగదారుడైనా వంట గ్యాస్ అందించే డెలివరీ, రేషన్ సరుకులు అంశాలలో ఫిర్యాదు చేస్తే సంబంధిత వారిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ధాన్యం కొనుగోళ్లు ప్రక్రియ వేగవంతం చేయడంతో పాటు రైతులు ఇబ్బందులు పడకుండా నిర్దేశించిన లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. ఉగాది నాటికి గృహ ప్రవేశాలు ఉంటాయని, ప్రభుత్వం నిర్దేశించిన విధంగా గృహ నిర్మాణాలను పూర్తి చేసి లక్ష్యాలను సాధించాలని తెలిపారు. రిజిస్ట్రేషన్, ఎక్సైజ్, మైనింగ్, కమర్షియల్ టాక్స్ శాఖల అధికారులు ప్రభుత్వ రెవెన్యూ రాబడి పై ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల కింద చేపట్టిన పనులపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల శ్రీధర్ రెడ్డి, జాన్సన్, మాధురి, కళావతి, కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొనగా, క్షేత్ర స్థాయి నుండి రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసిల్దార్లు, సంబంధిత శాఖల క్షేత్ర స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తాం: ఎమ్మెల్యే కందుల





**మార్కాపురం ఆర్.సి ఇంచార్జ్ పెన్ పవర్ డిసెంబర్ 30**

గత పాలకులు వెలిగొండ ప్రాజెక్టు విషయంలో ప్రజలను నిలువునా దగా చేశారని త్వరలో వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తిచేసి ఈ ప్రాంత రైతులు కళ్ళలో ఆనందం చూస్తామని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని చింతగుంట గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవే ఈ ప్రాంతానికి దూరం చేసి రైతుల నోట్లో మట్టి కొట్టిన చరిత్ర వైసిపి పార్టీని అన్నారు. రైతులు పండించిన మిర్చిని నేరుగా అమ్ముకోవద్దని ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ మిషన్లో ద్వారా మిర్చిని మిర్చి పౌడర్ గా మార్చి అమ్మితే అధిక లాభాలు ఉంటాయని సూచించారు. మార్కాపురం ప్రత్యేక జిల్లా ప్రకటించినందుకు గాను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

# రైతులు సేంద్రియ ఎరువులను వాడండి

### ఏవో షేక్ .మహమ్మద్



**పెన్ పవర్, కంభం డిసెంబర్ 30**

రైతులు సేంద్రియ ఎరువులను వాడు కొనాలని కంభం మండల వ్యవసాయ అధికారి షేక్. మహమ్మద్ మంగళవారం చిన్న కంభం హ జరత్ గూడెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సోదరులు ప్రస్తుతానికి పంటలకు అవసరం మేరకు మాత్రమే రసాయనిక ఎరువులను వాడుకొని ,సేంద్రియ ఎరువులు విరివిగా వాడుకోవాలని తెలియజేశారు. శనగ పంట వరి పంటకు కావలసిన ఎరువుల గురించి ఏ ఎరువులు ఎప్పుడు వాడుకోవాలో రైతులకు వివరించారు. గ్రామంలోని వరి పంటను పరిశీలించి అగ్గి తెగులు నివారణకు ఫిజీవన్ 330 ఎమ్మెల్ మరియు పొటాష్ లోప నివారణకు మల్టీకే కేజీ ఎకరానికి కలిపి పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. అలాగే శనగ పంటను కూడా పరిశీలించి రైతులకు పలు సూచనలు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

# పిల్లలపై అకృత్యాలు నివారించాలి

### - పలువురు వక్తలు




**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు డిసెంబర్ 30**

ఒంగోలు రిమ్స్ సర్వజన వైద్యశాల నందు గల బాల భవిత కేంద్రం నందు మంగళవారం బాలలపై లైంగిక దాడుల నివారణ గురించి జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ భగీరధి దేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం మెడికల్ ఆఫీసర్ ప్రీతం, డి ఈ ఐ సి మేనేజర్ స్టెఫీగ్రాఫ్, చైల్డ్ సైకాలజిస్ట్ కరవది అనిల్ పాల్గొని పిల్లలపై లైంగిక దాడులు రకాలు, పిల్లలపై మానసిక గాయాలు వాటి ప్రభావాలు, పిల్లల ప్రవర్తన పై శిక్షణ ఇచ్చారు. పిల్లలపై అకృత్యాలు జరగకుండా చూడవలసిన బాధ్యత అందరిపై ఉందని పిల్లలకు అవగాహన హద్దులు కమ్యూనికేషన్ గురించి చెప్పాలని సిబ్బందికి తెలియజేశారు. ముఖ్యంగా పిల్లల రక్షణ చట్టాలైన ఫోక్సో 2012 చట్టం గురించి అలాగే చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 టోల్ ఫ్రీ నెంబర్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బాల భవిత కేంద్రం ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సునీత డెంటిస్ట్ డాక్టర్ జయలక్ష్మి, ఎర్లీ ఇంటర్వెన్షనిస్ట్ విద్య, సోషల్ వర్కర్ రాము జిల్లా నలుమూలల నుంచి మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, ఏఎన్ఎంలు పాల్గొని విజయవంతం చేశారు.

# చంద్రన్న మాట ఇచ్చాడు మార్కాపురం జిల్లా చేసాడు




**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ డిసెంబర్ 30**

ఎన్నికల సమయంలో ప్రతిపక్షంలో ఉన్న నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే మార్కాపురం జిల్లా చేస్తానని చెప్పి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని నియోజకవర్గఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు అన్నారు.మార్కాపురంను జిల్లాగా ప్రకటించిన నేపథ్యంలో పార్టీ కార్యాలయంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అభిలాష మేరకు మార్కాపురంను ముఖ్యమంత్రి జిల్లాగా ప్రకటించారని వెనుకబడిన పశ్చిమ ప్రాంతం వడి వడిగా అభివృద్ధి చెందుతుందని, మార్కాపురం జిల్లాలోని ప్రజలు అభివృద్ధి ఫలాలు చూస్తారని అన్నారు. రాష్ట్ర, జిల్లా, మండలాల అభివృద్ధి తెలుగుదేశం ప్రభుత్వంలోనే సాధ్యమని చంద్రన్న అభివృద్ధి మాంత్రికుడని అన్నారు. అనంతరం పార్టీ అభివృద్ధికి కృషి చేసిన కార్యకర్తలకు ఆయన ప్రశంస పత్రాలను అందజేశారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, పట్టణ అధ్యక్షులు పెరుమాళ్ళ మల్లికార్జున,మంత్రునాయక్, అల్లమాలిక్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ హరిహర క్షేత్రంలో వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

### - పాల్గొన్న రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు లక్ష్మీ పద్మావతి దంపతులు

**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు డిసెంబర్ 30**

వైకుంఠ ఏకాదశి సందర్భంగా; చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో మంగళవారం ముక్కోటి ఏకాదశి; శ్రీవారి, అమ్మవారి ఉత్తర ద్వార దర్శనం భాగ్యం వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు లక్ష్మీ పద్మావతి దంపతులు ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిద్దా రాఘవరావు దంపతులు మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రకాశం జిల్లా రాష్ట్ర ప్రజలు వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని; కోరుకుంటున్నట్టు తెలిపారు. ధనుర్మాసం సందర్భంగా శ్రీవారి; ఆలయంలో ఆస్థాన అర్చకులు శ్రీమాన్ వెంకటహరి కుమారాచార్యులు ఆధ్వర్యంలో ,శ్రీవారి మహామండపం నందు సామూహిక శ్రీ సత్యన్నారాయణ వ్రతములు వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం లో ఆలయ ధర్మకర్తలు శిద్దా పాండురంగరావు దంపతులు, శిద్దా సుధాకర్ దంపతులు, శిద్దా పెద్ద బాబు,శిద్దా సాయి బాబు దంపతులు,శిద్దా బాలాజీ దంపతులు,శిద్దా సురేష్ దంపతులు,శిద్దా కాశీ దంపతులు,ఏ.ఎమ్.సి చైర్మన్ మన్నం



ప్రసాద్ దంపతులు,భక్తులు పాల్గొన్నారు. ధనుర్మాసం ఏకాదశి పునస్కరించుకొని శ్రీ వారి మండలంలో; గోదాదేవి సమేత శ్రీ రంగనాథ స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామి వారికి,అమ్మవారికి ప్రత్యేక పూజలు,పాశురం సమర్పణ,తిరుప్పావై ,విష్ణు



సహస్ర నామ పారాయణం భక్తుల సహకారంతో నిర్వహించారు. అర్చకులు సుబ్రహ్మణ్య శర్మ, హరికృష్ణ శర్మ; భక్తులకు అందజేశారు ఉభయ దాతలు ఆధ్వర్యంలో భక్తులకు అన్న సంతర్పణ నిర్వహించారు.

### రబి సీజన్ లో వేసిన ప్రతి పంటను

# ఈ పంట నమోదు చేసుకోవాలి



**గిద్దలూరు పెన్ పవర్ డిశంబర్ 30**

గిద్దలూరు మండలంలో అంబవరం, వెల్లుపల్లి గ్రామంలో మండల వ్యవసాయాధికారి విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ రబీ 2025-26 కి సంబంధించి ఈ - పంట నమోదు కార్యక్రమం జరుగుతుందని. రైతులు అందరూ తప్పనిసరిగా రబీ సీజన్లో వేసిన ప్రతి ఒక్క పంటను నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ-పంట నమోదు చేసుకోవడం వలన అతివృష్టి , అనావృష్టి వచ్చినప్పుడు నష్టపోయిన పంటలకు ప్రభుత్వం ద్వారా అందించే నష్టపరిహారం, పంటల భీమా, మద్దతు ధర , సున్నా వడ్డీ తదితర ప్రభుత్వ పథకాలు అందాలంటే తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకొని ఉండాలని తెలిపారు. మొక్కజొన్న సాగులో యూరియా (నత్రజని) కీలకమైన పోషకమే అయినప్పటికీ, అవసరానికి మించి అధికంగా వాడటం వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ జరుగుతుందని తెలుపుతూ మొక్క ఆరోగ్యంపై ప్రభావం అధిక పెరుగుదల - తక్కువ బలం: యూరియా వల్ల మొక్కలు చూడటానికి ఏపుగా, పచ్చగా పెరుగుతాయి. కానీ, కాండం బలహీనంగా మారి గాలి వానలకు మొక్కలు సులభంగా పడిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. చీడపీడల తాకిడి: మొక్కలు మరీ మెత్తగా, రసభరితంగా ఉండటం వల్ల అగ్గి తెగులు, కాండం తొలిచే పురుగు , ఇతర రసం పీల్చే పురుగులు త్వరగా ఆశిస్తాయన్నారు దిగుబడి, నాణ్యత తగ్గడం ?గింజ సరిగ్గా పట్టకపోవడం: కేవలం ఆకులు, కొమ్మలే పెరుగుతాయి తప్ప, కంకిలో గింజలు సరిగ్గా నిండవు. దీనివల్ల గింజ బరువు తగ్గి దిగుబడి పడిపోతుందన్నారు. కాలావధి పెరగడం: పంట కోతకు రావాల్సిన సమయం కంటే ఆలస్యమవుతుందని దీనివల్ల తదుపరి పంట వేయడం ఆలస్యమవుతుందన్నారు. గ్రామ సభ అనంతరం శనగ పంట క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి ఆ పంటలో వచ్చు చీడ పీడలు , వాటి నివారణ చర్యలు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి,శ్రీకాంత్ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు హనుమంత రెడ్డి, వరలక్ష్మి , రైతులు పాల్గొన్నారు.

# ప్రతి రైతు తప్పని సరిగా పంట నమోదు చేసుకోవాలి

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ డిసెంబర్ 30**

ఈ రబిలో పంట సాగు చేసిన ప్రతి రైతు తప్పని సరిగా పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కే, నీరజ అన్నారు.మంగళవారం మండలంలోని మిల్లంపల్లి, కాశి కుంట తండా గ్రామాలలో వ్యవసాయ శాఖ,అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఎక్కువ విస్తీర్ణంలో విత్తన మొక్కజొన్న సాగు చేయడం జరిగిందని, విత్తన మొక్కజొన్న సాగుచేసిన రైతులందరూ తప్పనిసరిగా ఒప్పంద పత్రాలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల కురిసిన తుఫాన్ వలన భూగర్భ జలాలు పెరిగి నీరు తగినంత అందుబాటులో ఉన్నందున రైతులందరూ డిమాండ్ ఆధారిత పంటలను సాగు చేయాలని సూచించారు.అనంతరం రైతులతో కలిసి సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను పరిశీలించారు. మొక్క జొన్న పంటలో కత్తెర పురుగు గమనించడం జరిగింది. మొక్కజొన్న విత్తనాలను ఫోర్టెంజా డియో మందును నాలుగు మిల్లీలీటర్లు ఒక కేజీ విత్తనానికి కలిపి విత్తినట్లయితే కత్తెర పురుగును రాకుండా నివారించవచ్చని,కత్తెర పురుగు ఉధృతి ఎక్కువ అయినట్లయితే ఇమమెక్టిన్ బెంజోఏట్ 5% అనే మందును ఒక ఎకరానికి 80 గ్రాములు పిచికారి చేయాలని వివరించారు.విషపు ఎరలను వాడుట ద్వారా కత్తెర పురుగును సమర్ధవంతంగా నివారించవచ్చని,



మొక్కజొన్న పంటలు ఎక్కువగా జింక్ లోపం గమనించడం జరిగింది దీని నివారణకు జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని రెండు గ్రాములు ఒక లీటరు నీటికీ కలిపి పిచికారి చేయాలని సూచించారు. కంది పంట పూత దశలో ఉందని ఈ సంవత్సరం అనుకూల వర్షపాతం వలన కంది పంట ఎక్కువ దిగుబడి వచ్చే అవకాశం ఉందని,కంది పంటలో పూతరాలడం గమనించామని,దీని నివారణకు ప్లానోఫిక్స్ అనే మందును 0.5 మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులు మరియు రైతులు పాల్గొన్నారు.

# కొమరోలు ఎస్సై నాగరాజు కు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ప్రశంసలు

### కొమరోలు పోలీస్ స్టేషన్లో త్వరితగతిన కేసుల పరిష్కారం, గణనీయంగా తగ్గిన క్రైమ్ రేట్.

### క్రైమ్ రేట్ తగ్గుటకు కృషిచేసిన ఎస్సై నాగరాజుకు ప్రశంసా పత్రం అందజేసి అభినందించిన జిల్లా ఎస్పీ.

**కొమరోలు పెన్ పవర్ డిసెంబర్ 30**


కొమరోలు ఎస్సై జక్కుల నాగరాజుకు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ప్రశంసా పత్రం అందించి అభినందించారు. 2025 సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా పోలీస్ స్టేషన్లో నమోదైన క్రైమ్ రేట్ పై జిల్లా ఎస్పీ అధ్యయనం చేశారు. అందులో భాగంగా కొమరోలు పోలీస్ స్టేషన్ లో 25 సంవత్సరంలో క్రైమ్ రేట్ గణనీయంగా తగ్గేందుకు, నమోదైన కేసులను త్వరగా పరిష్కరించేందుకు కృషిచేసిన కొమరోలు ఎస్సై జక్కుల నాగరాజును జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు అభినందించారు. 2024లో కొమరోలు పోలీస్ స్టేషన్లో188 కేసులు నమోదు కాగా 2025లో ఆ సంఖ్య 132 కు తగ్గిపోయింది. అలాగే కొమరోలు ఎస్సైగా నాగరాజు బాధ్యతలు స్వీకరించిన నాటికి 60 కేసులు ఉండగా గత పది నెలల కాలంలో ఆ కేసుల సంఖ్య 23 తగ్గిపోయింది. అంతేకాక నమోదైన కేసులను త్వరితగతిన పరిష్కరించడం, పలు కేసులలోని నిందితులను




అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచటం, దొంగతనాల కేసులలో బాధితులు కోల్పోయిన సొమ్మును రికవరీ చేయడం లాంటి సంఘటనలో ఎస్సై నాగరాజు చేసిన కృషిని ఎస్పీ గుర్తించారు. ఆ మేరకు ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు కొమరోలు ఎస్ఐ నాగరాజుకు ప్రశంసా పత్రం అందించి అభినందించారు. జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న కొమరోలు ఎస్సై నాగరాజును కొమరోలు ఏఎస్ఐ మునాఫ్, కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డులు, స్టేషన్ సిబ్బంది హర్ష వ్యక్తం చేస్తూ ,ఎస్సై నాగరాజుకు శుభాకాంక్షలు తెలిపారు . దీనితో రెండు రోజుల ముందే కొమరోలు పోలీస్ స్టేషన్లో నూతన సంవత్సర ఆనందోత్సవాలు వెల్లి విరిసాయి. ఇక పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీల ప్రముఖ నేతలు, విద్యావేత్తలు ఎస్సై నాగరాజు కు శుభాకాంక్షలు తెలియజేస్తూ అభినందించారు.

# బేకరీల బాగోతం

### - పండుగ సమయంలో వినియోగదారులను దోపిడి చేస్తున్నా వైన్యం!!



**గిద్దలూరు పెన్ పవర్ డిశంబర్ 30**

గిద్దలూరు పట్టణంలో అధికారులు సోమవారం పలు బేకరీల షాపుల పై ఆకస్మిక దాడులు చేసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కేజీ కేకు పేరిట వినియోగదారులకు దాదాపు 200 గ్రాముల పైనే తక్కువగా అమ్ముతున్న వైనం వెలుగులోకి వచ్చింది. 1కేజీ ప్రకారం డబ్బులు వసూలు చేస్తున్నా బెకరీలు.. తూకాలు పరిశీలించిన అధికారులు ఈ అక్రమాలను చూసి ఒక్కసారిగా కంగుతిన్నారు. క్రిస్మస్, నూతన సంవత్సరం వంటి పండుగలను ఆసరాగా చేసుకుని కొంతమంది బేకరీ నిర్వాహకులు విని యోగదారులను దోచుకుంటున్నారని అధికారులు పేర్కొన్నారు. తూకాల్లో మోసాలకు పాల్పడుతున్న బేకరీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో పాటు, ప్రజలు కూడా కొనుగోలు సమయంలో తూకాలను తప్పనిసరిగా పరిశీలించాలని అధికారులు సూచించారు.

### తిరుమల శ్రీవారిని దర్శించుకున్న

# ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు పెన్ పవర్ డిశంబర్ 30**

వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి దంపతులు తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. శ్రీవారి దివ్య ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని, సుఖసంతోషాలు, ఆరోగ్యం, శాంతి ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గ ప్రజలందరికీ "వైకుంఠ ఏకాదశి" శుభాకాంక్షలు.

# డాక్టర్లు ఉండరు - వైద్యం అందదు

## వైద్యులు లేకపోవడంతో సిబ్బందే డాక్టర్ల పాత్రలోకి






**కొనకనమిట్ల పెన్ పవర్ డిసెంబర్ 30**

కొనకనమిట్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో వైద్య సేవలు పూర్తిగా అస్తవ్యస్తంగా మారాయి.ఆసుపత్రిలో విధులు నిర్వహించాల్సిన ఇద్దరు డాక్టర్లు మంగళవారం అందుబాటులో లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో రోగులకు సరైన వైద్యం అందడం లేదని బాధితులు వాపోతున్నారు. డాక్టర్లు సెలవులో ఉన్నారని ఆసుపత్రి సిబ్బంది చెబుతున్నప్పటికీ, అసలు వారు అధికారికంగా సెలవులు పెట్టారా ? లేక సిబ్బందితో అలా చెప్పించారా ? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.ఈ ఇద్దరు డాక్టర్లు నిజంగానే సెలవులో ఉంటే,వైద్య సేవలను ఎవరు నిర్వహించాలి? ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేయలేదు? అని రోగులు ప్రశ్నిస్తున్నారు.వైద్యశాలలో ఒక్క ఫార్మసిస్ట్ తప్ప మరో సిబ్బంది ఎవ్వరూ కనిపించకపోవడం గమనార్హం.రోగులకు వైద్యం అందించాల్సిన పరిస్థితిలో డాక్టర్లు లేకపోవడంతో అత్యవసర కేసులు వచ్చినా చికిత్స ఎలా అందిస్తారన్న భయం ప్రజలను వెంటాడుతోంది. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఈ పరిస్థితి ఉంటే పేద, మధ్యతరగతి ప్రజలు ఎవరిని ఆశ్రయించాలనే ప్రశ్న తలెత్తుతోంది.ప్రభుత్వ ఆసుపత్రిపై నమ్మకం కోల్పోయిన పలువురు రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.వైద్యశాఖ అధికారులు దీనిపై తక్షణమే స్పందించి డాక్టర్ల గైర్హాజరుపై విచారణ చేపట్టి పూర్తి స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## తేదేపా ఉత్తమ కార్యకర్తగా కామినేని అనీల్



**వలేటివారిపాలెం, పెన్ పవర్, డిసెంబర్ 30**

తెలుగుదేశం పార్టీ ప్రతిష్మాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని మై టీడీపీ యాప్ ద్వారా గ్రామంలోని ప్రతి గడపకు తిరిగి విజయవంతం చేసిన ప్రతి కార్యకర్తను టెక్నికల్ ద్వారా గుర్తించి వారికి తగిన ప్రాధాన్యతనిస్తూ టిడిపి పార్టీ ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు. అందులో భాగంగా స్థానిక వలేటివారిపాలెం మండలంలోని చుండి గ్రామానికి చెందిన కామినేని అనీల్ ఉత్తమ కార్యకర్త గా ఎంపికయ్యారు. ప్రశంసా పత్రం ,ఫోటోలను కందుకూరు తేదేపా పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కోసం ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా కృషి చేశారని వారి కృషి ఫలితంగానే టెక్నికల్ ద్వారా అధిష్టానం దృష్టికి వెళ్ళిన వారి పేర్లు మాత్రమే వచ్చాయని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మరింత చురుగ్గా పనిచేసి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని అనిల్ తెలిపారు.ఈ కార్యక్రమం లో మేకల అశోక్, కామినేని అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## చట్టవ్యతిరేకంగా ప్రవర్తించినప్పుడుమార్పు రావడం కోసం జైల్లో ఉంచుతారు

### సబ్ జైల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జూనియర్ సివిల్ జడ్జి ఏ. ఓంకార్





**గిద్దలూరు పెన్ పవర్ డిశంబర్ 30**

గిద్దలూరు పట్టణంలోని సబ్ జైల్ ను గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ. ఓంకార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు .చట్ట వ్యతిరేకంగా ప్రవర్తించినప్పుడు మార్పు రావడం కోసం జైల్లో ఉంచుతారని, జైలులో, జైలు జీవితం అనుభవించిన తర్వాత మంచి పౌరులుగా మారి కుటుంబ సభ్యులను జాగ్రత్తగా చూసుకోవాలని హితవు పలికారు .ఎంతో కష్టపడి సంపాదించిన డబ్బును త్రాగుడుకు, ఇతర వ్యసనాలకు ఖర్చు చేసి ఒంటిని, ఇంటిని గుల్ల చేసుకోవద్దన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. న్యాయవాదిని పెట్టుకోలేని ఖైదీలకు మండల న్యాయ సేవాధికారి సంస్థ తరపున ఉచితాముగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలియజేశారు.ప్రతి ఒక్క ఖైదీని జడ్జి విచారించారు. జైలులో అందిస్తున్న సదుపాయాలను గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందిస్తున్నటువంటి బియ్యాన్ని, సరుకుల నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సబ్ జైల్ సూపర్ండెంట్ యూ. లింగారెడ్డి, లీగల్ ఎయిడ్ న్యాయవాది ఎన్. అహల్య, పారా లీగల్ వాలంటర్ అద్దంకి. మధుసూధనరావు,కోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రకాశం జిల్లాలో అద్దంకి కందుకూరు నియోజకవర్గాలు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.523 జారీ

**- జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు**



**కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ డిసెంబర్ 30**

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 29వ తేదీన జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ఏపీ జిల్లాల పునర్విభజన ప్రతిపాదనలకు ఆమోదం తెలపడంతో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పరిధిలోని కందుకూరు నియోజక వర్గాన్ని, బాపట్ల జిల్లాలోని అద్దంకి నియోజక వర్గాన్ని ప్రకాశం జిల్లాలో చేరుస్తూ 28 మండలాలతో ప్రకాశం జిల్లా ను పునర్వ్యవస్థీకరిస్తూ మంగళవారం జిఓ ఎంఎస్. నెం.523ను జారిచేసినట్లు జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు నేడొక ప్రకటనలో తెలిపారు. కందుకూరు, లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు, వలేటివారిపాలెం, మర్రిపూడి, పొన్నలూరు మండలాలతో కూడిన కందుకూరు రెవెన్యూ డివిజన్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒంగోలు రెవెన్యూ డివిజన్లో కొండపి, జరుగుమల్లి, సింగరాయకొండ, ఒంగోలు అర్బన్, ఒంగోలు రూరల్, కొత్తపట్నం, సంతనూతలపాడు, నాగులుప్పలపాడు, మద్దిపాడు, చీమకుర్తి, టంగుటూరు మండలాలు ఉంటాయని పేర్కొన్నారు. కొరిసపాడు, జే పంగలూరు, అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, ముండ్లమూరు, తాళ్ళూరు, దర్శి, దొనకొండ, కురిచేడు మండలాలతో అద్దంకి రెవెన్యూ డివిజన్ ను ఏర్పాటుచేస్తున్నట్లు ఆయన వివరించారు.

# న్యూ ఇయర్ వేడుకలను అత్యంత ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

**ఈనెల 31వ తేదీ రాత్రి ఒంటిగంటలోపు కార్యక్రమాలు ముగించుకోవాలి.**

**పోలీసుల నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తించినా,**

**రాత్రి ఒంటి గంట తర్వాత రోడ్లపై కనిపించిన వారిపై కేసులు నమోదు.**

**పాత్రికేయుల సమావేశంలో ఎస్సై నాగరాజు వెల్లడి.**



**కొమరోలు పెన్ పవర్ డిసెంబర్ 30**

2026 నూతన సంవత్సర వేడుకలను ప్రజలు అత్యంత ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కొమరోలు ఎస్సై జక్కుల నాగరాజు కోరారు. ఈ నెల 31వ తేదీ పాత సంవత్సరానికి ముగింపు పలుకుతూ, కొత్త సంవత్సరం స్వాగతం పలుకుతూ ప్రజలు చేసుకునే సంబరాలపై ఎస్సై నాగరాజు కొన్ని నిబంధనలు విధించారు. మంగళవారం సాయంత్రం కొమరోలు పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై నాగరాజు మండల ప్రజలకు ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ,పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ఈ నెల 31వ తేదీ రాత్రి ప్రజలు సంబరాలు చేసుకుంటారని, అయితే సంబరాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. ద్విచక్ర వాహనాలపై అతివేగంతో, సైలెన్సర్లు తొలగించి పెద్ద పెద్ద శబ్దాలతో రోడ్లపై కేకలు వేస్తూ తిరగటాన్ని నిషేధించామన్నారు. త్రిబుల్ రైడింగ్ లు కూడా పూర్తిగా నిషేధించామన్నారు. ప్రమాదంలో జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రమాదాలు జరిగితే ప్రాణాలు కోల్పోయి కుటుంబ సభ్యులకు తీవ్ర ఆవేదన నష్టాలను కలిగిస్తారని ఆయన వివరించారు .కేకులు కట్ చేయడం, సంబరాలు చేసుకోవడం తదితర కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో ఇతరుల హక్కులకు భంగం వాటిల్లకుండా నిర్వహించుకోవాలని కోరారు. నూతన సంవత్సర సంబరాలను ఈ నెల 31వ తేదీ రాత్రి 1:00 లోపు ముగించుకోవాలన్నారు. రాత్రి ఒంటి గంట తర్వాత రోడ్లపై తిరిగే వారిపై కేసు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. రోడ్లపై కేకలు చేస్తూ అల్లర్లు సృష్టించడం, ఘర్షణలకు పాల్పడం చట్టరీత్యా నేరమని ఆయన పేర్కొన్నారు. పోలీసు 30 యాక్ట్ అమలులో ఉన్నదని అందువల్ల ముందస్తు అనుమతులు లేకుండా ఎలాంటి ఊరేగింపులు, సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా డీజేల వినియోగాన్ని పూర్తిగా నిషేధించామని ,అందువల్ల డీజేలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలిగించితే డీజే ఏర్పాటుచేసిన వారిపై, డీజేల యజమానులపై కేసులు నమోదు చేస్తామని, అంతేకాక డీజేలు ఏర్పాటు చేసిన వాహనాలను, డీజే బాక్సును సీజ్ చేసి కోర్టుకు అప్పగిస్తామని ఆయన హెచ్చరించారు. కొమరోలు తోపాటు పలు గ్రామాలలో కూడా డీజేలయజమానులు ఉన్నట్లుగా గుర్తించామని ఆయన చెప్పారు. వారందరూ పోలీసుల హెచ్చరికలను ఆదేశాలను దృష్టిలో ఉంచుకొని ప్రవర్తించాలని ఎస్ఐ నాగరాజు కోరారు.

# ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

### *కోదండ రామస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు*



**పుల్లల చెరువు పెన్ పవర్ డిసెంబర్ 30**

ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటే మోక్ష ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో వైకుంఠ ఏకాదశి పండుగను పురస్కరించుకుని పుల్లల చెరువు మండలంలోని రామాలయాలు మంగళవారం హరినామస్మరణతో మారుమోగిపోయాయి. దేవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మండల కేంద్రం పుల్లల చెరువులోని శ్రీ కోదండ రామ స్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.తెల్లవారుఝామునుంచే ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు ఎగబడ్డారు.భక్తుల రద్దీతో ఆలయం పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త కొర్లకుంట జానకీరఘు, మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు గోపవరపు గురునాధం మాట్లాడుతూ పూర్వకాలంలో పాలసముద్రంపై శయనించిన మహావిష్ణువును దర్శించుకునేందుకు ముక్కోటి దేవతలంతా ఈ ఏకాదశి తిథినాడు వైకుంఠానికి చేరుకుంటారని పురాణాల్లో పేర్కొనబడిందన్నారు. ఈ కారణంగానే ఈ పర్వదినానికి వైకుంఠ ఏకాదశి అనే పేరు వచ్చిందని వివరించారు.అలాగే మధు, కైటబుల వంటి రాక్షసులకు మహావిష్ణు దర్శనంతో శాప విమోచనం కలిగిందని పురాణాలు చెబుతున్నాయని తెలిపారు.భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటే మోక్ష ప్రాప్తి కలుగుతుందనే నమ్మకం ఉందన్నారు.ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ పూజారి శేషభట్టారు అనంతాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ధనుర్మాసం సందర్భంగా వేకువ ఝామునుంచి భక్తులు నగర సంకీర్తన నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి, ధనుర్మాసం కలయికతో అధిక సంఖ్యలో భక్తులు నగర సంకీర్తనలో పాల్గొన్నారు. పట్టణంలోని పురవీధులంతా జై శ్రీరామ్ నినాదాలతో మిన్నుముట్టాయి.ఈ కార్యక్రమంలో వైశ్య ప్రముఖులు, గ్రామస్థులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ




**కందుకూరు పెన్ పవర్, డిసెంబర్ 30**

తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం క్యాలెండరు ను కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మన్న%ళి% శ్రీనివాసులు, చెరుకూరి పూర్ణ చంద్రరావు, యనమల ఆంజనేయులు, తల్లపనేని శ్రీనివాసరావు, తోట్టెంపూడి రామచంద్ర, కొచర్ల మాల్యాద్రి,, దివి కోటేశ్వరరావు, ఉన్నం వెంకటేశ్వర్లు, ఇంటూరి శ్రీనివాసరావు, నల్లూరి ప్రసాదరావు, కందుకూరి సుబ్బానాచారి, మండలపు రమేష్, ఉన్నం రమేష్, ఏలూరి సుబ్బానాయుడు, తదితర ఉపాధ్యాయలు పాల్గొన్నారు. ఉపాధ్యాయులందరికీ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## కందుకూరు తహశీల్దార్ లావణ్యా బదిలీ



**కందుకూరు పెన్ పవర్, డిసెంబర్ 30:**

కందుకూరు తహశీల్దార్ లావణ్య బదిలీ అయ్యారు. 9 నెలల క్రితం ఆమె కందుకూరు తహశీల్దార్ బాధ్యతలు చేపట్టారు. కందుకూరు నియోజకవర్గం ప్రకాశం జిల్లాలో విలీనమవుతున్న నేపథ్యంలో ఈ బదిలీ జరిగిందని తెలిసింది. మారిటైంబోర్డ్ చేపట్టిన భూసేకరణ ప్రక్రియ కోసం ఆమెను కావలికి బదిలీ చేశారు. సోమవారం రాత్రికి రాత్రి బదిలీ ఉత్తర్వులు రావడం రిలీవ్ కావడం వెంటనే జరిగినట్టు సమాచారం. డిప్యూటీ తహశీల్దార్ ను ఇన్చార్జిగా నియమించారు.

## అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు




**పెద్ద దోర్నాల పెన్ పవర్ డిసెంబర్ 30**

మండల కేంద్రంలోనిప్రకాశం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం దోర్నాల పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ బెల్ట్ షాపులపై ఎస్సై వెంకట రమణయ్య తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని వారి నుండి 1 ఫుల్ బాటిల్, 19 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అక్రమ మద్యం విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఎస్సై వెంకట రమణయ్య తెలిపారు.

## నేడు బలరాం కాలనీ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత


**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ డిసెంబర్ 30**

11 కెవి బలరాం కాలనీ ఫీడరు విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు బలరాం కాలనీ, పనుగుపాటి కాలనీ, మిలటరీ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ కేశవరాజు గుంట, 11 కేవీ లీడర్ లో గల చిన్న మల్లేశ్వర కాలనీ, కేశవరాజు కొండ పరిసర ప్రాంతాలలో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డి .ఈ. ఈ కే.వి పాండురంగారావు తెలియజేశారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

# ఎంఎంఎస్‌లో ప్రకృతి వ్యవసాయం పై అవగాహన సదస్సు

**అర్ధవీడు, పెన్ పవర్, డిశంబర్ 30**

అర్ధవీడు మండల సమైక్య కార్యాలయంలో విఓఎలు మరియు పీవో అధ్యక్షుల కోసం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుండి వచ్చిన వివోఎలు, పీవో అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ డి లలితమ్మ మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం వల్ల భూసారత తగ్గడంతో పాటు రైతుల ఖర్చులు పెరుగుతున్నాయని తెలిపారు. దీనికి ప్రత్యామ్నాయంగా ప్రకృతి వ్యవసాయ విధానాలను అనుసరించడం ద్వారా తక్కువ పెట్టుబడితో సుస్థిర సాగు సాధ్యమవుతుందని వివరించారు. ఈ సందర్భంగా జీవామృతం, ఘనజీవామృతం, వేప ఆధారిత ద్రావణాల తయారీ విధానాలను వివరించారు. అలాగే ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు లాభాలు, పంటల దిగుబడులు, మట్టి ఆరోగ్యం మెరుగుపడే విధానాలను తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు అడిగిన సందేహాలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. అర్ధవీడు మండలంలో కాకర్ల, బొల్లుపల్లె,



మొహిద్దీన్ పురం పంచాయతీలను ప్రకృతి వ్యవసాయం కొరకు ఎంపిక చేయడం జరిగిందన్నారు అందరు వివోఏలు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభాలను అర్జించవచ్చని పేర్కొన్నారు. చివరగా విఓఎలు మరియు పీవో అధ్యక్షులు తమ గ్రామాల్లో రైతులకు ప్రకృతి వ్యవసాయం పై విస్తృతంగా అవగాహన కల్పించాలని నిర్వాహకులు కోరారు. ఈ



కార్యక్రమంలో ఏపిఎం రమేష్ బాబు, డిజిఎం రంగనాయకులు, శ్రీనిధి మేనేజర్ రాజేశ్వరి, సిసి గురువయ్య, అకౌంటెంట్ శ్రీదేవి, మండల సమైక్య అధ్యక్షురాలు నాగమణి, ఉపాధ్యక్షురాలు రామంజమ్మ, మండలంలోని అన్ని గ్రామాల వివోఏలు, వివో అధ్యక్షులు, ఐసి ఆర్ పిలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బుర్రా ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సర వేడుకలు



**కందుకూరు పెన్ పవర్, డిసెంబర్ 30**

మాజీ శాసనసభ్యులు, కందుకూరు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు కందుకూరు వైయస్సార్సీపి పార్టీ కార్యాలయంలో జనవరి 1 గురువారం ఉదయం 09:00 నుండి ఘనంగా నిర్వహిస్తున్నట్లు వైకాపా కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది . కావున కందుకూరు నియోజకవర్గ ప్రజలు, అన్ని మండలాల నాయకులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డ్ మెంబర్లు, వైయస్సార్సీపి అనుబంధ విభాగాల అధ్యక్షులు,కార్యకర్తలు,వైయస్ఆర్సీపీ నాయకులు అందరూ తప్పనిసరిగా పాల్గొనవలసిందిగా కోరారు.

# వీరభద్రాపురంలో పేకాటరాయుళ్ళు అరెస్ట్



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ డిసెంబర్ 30**

మండలంలోని వీరబద్రపురం గ్రామంలోని పేకాట శిబిరంపై పోలీసులు దాడిచేసి పేకాట ఆడుతున్న నలుగురిని స్థానిక యస్ ఐ, పి, చౌడయ్యా అదుపులోకి తీసుకున్నారు. పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారం అందుకున్న యస్ ఐ చౌడయ్య మారు వేషంలో సిబ్బందితో వెళ్లి పేకాట రాయుళ్లను ఆడుపులోకి తీసుకుని వారివద్ద నుండి 5040రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. వీరిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేకాట, కోళ్ల పందేలు, ఇతర సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సయ్యద్ నిజాం, షేక్ బాషా, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వైకుంఠ ఏకాదశి



**దొనకొండ డిసెంబర్ 30 పెన్ పవర్**

మండల కేంద్రంలో ని విరాట్ నగర్లో గల శ్రీ ఆనంద ఆశ్రమంలో వైకుంఠ ఏకాదశి శ్రీ గోవిందమాంబ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఉదయం 5 గంటల నుండి శ్రీ గోవిందమాంబ సహిత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారికి శ్రీ గోదాదేవి సహిత శ్రీ రంగనాథ స్వామి వారికి పంచామృత అభిషేకాలు ప్రత్యేక అలంకరణ చేశి అష్టోత శతనామావళి సహస్రనామార్చనలు చేసి మహా నైవేద్యములు మహా మంగళహారతులు ఇచ్చారు అనంతరం భైరవానంద స్వామి మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి అనగా పవిత్రమైన రోజు అని ఈరోజుని భగవంతుని ఆరాధనకి వినియోగించాలి భక్తులందరూ భగవంతుని చేరే పవిత్రమైన రోజు వైకుంఠ ఏకాదశి ఆ రోజున ముక్కోటిదేవతలు స్వామిని కొలవడానికి వైకుంఠానికి వచ్చిన రోజు అందుకే ముక్కోటి ఏకాదశి అన్నారు కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు ఇచ్చిన భక్తులు ఆశ్రమ అర్చకులు మని బాబు శర్మ తీర్థప్రసాదాలు అంద చేశారు.

# డీజేల నిర్వహణపై పోలీసుల కొరడా

## పెన్ పవర్ కథనానికి స్పందించిన ఎస్సై నాగరాజు.

## డీజేలు నిర్వహించే వారిపై, డీజేల యజమానులపై కఠిన చర్యలు తప్పవు.

**కొమరోలు పెన్ పవర్ డిసెంబర్ 30**



కొమరోలు మండలంలో డీజేల నిర్వహణపై కఠిన చర్యలు తీసుకుంటామని కొమరోలు ఎస్ఐ నాగరాజు హెచ్చరించారు. పోలీసుల హెచ్చరికలు, ఆదేశాలను కొమరోలు మండలం లోని కొమరోలు పట్టణంతోపాటు గ్రామాలలో సైతం పగలు రాత్రి తేడా లేకుండా వివాహాలు, ఉత్సవాలు, తిరునాళ్లకు, వ్యాపార ప్రకటనల ప్రచారానికి నిర్వాహకులు డీజీలను పెద్ద పెద్ద శబ్దాలతో నిర్వహిస్తూ ఉన్నారని, డీజేల నిర్వహణతో ముఖ్యంగా గుండె జబ్బులతో బాధపడే రోగులు, వృద్ధులు, చిన్నారులు, సాధారణ ప్రజలు సైతం తీవ్ర అనారోగ్యాలకు గురవుతూ ఇబ్బందులు పడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీజేల నిర్వహించే పరిసర ప్రాంతాల ప్రజలు ఇల్లలో ఉంటూ, తలుపులు వేసుకున్నప్పటికీ డీజే శబ్దాలు ఇళ్లలోనికి వస్తూ, ప్రజలను ఆందోళనకప గురి చేస్తున్నాయి. గత ఆదివారం రాత్రి కొమరోలు లోని ప్రధాన ఆర్ అండ్ బి రోడ్డుపై ఒక వివాహ సందర్భంగా డీజే ను ఏర్పాటు చేశారు. దీనితో ఆ పరిసర విధుల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు, ఆందోళన గురయ్యారు సదరు విషయాన్ని వివరిస్తూ పెన్ పవర్ దినపత్రికలో సోమవారం "డీజేలపై నిషేధం ఉల్లంఘన" అనే శీర్షికతో వార్తా కథనం వెలువడింది. అందుకు స్పందించిన కొమరోలు ఎస్సై నాగరాజు తీవ్రంగా స్పందించారు. డీజే లను ఏర్పాటు చేయరాదని గతంలో తాము ఆదేశాలు, హెచ్చరికలు జారీ చేశామన్నారు. వాటిని ఉల్లంఘిస్తూ డీజే లు ఏర్పాటు చేస్తున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కొమరోలు పట్టణంతోపాటు పరిసర గ్రామాలలో కూడా డీజేల యజమానులు ఉన్నట్టుగా గుర్తించామని, వారందరినీ స్టేషన్ పిలిపించి హెచ్చరిస్తామని తెలిపారు. పోలీసుల ఆదేశాలు, హెచ్చరికలను, నిబంధనలను ఉల్లంఘించి డీజేలు ఏర్పాటు చేసే నిర్వాహకులపై, డీజేల యజమానులపై కేసులు బనాయిస్తామని, అంతేకాక డీజే బాక్సులు వాటిని ఏర్పాటు చేసిన వాహనాలను సీజ్ చేసి కోర్టుకు అప్పగిస్తామని ఆయన హెచ్చరించారు. డీజేలు ఏర్పాటు చేసే నిర్వాహకులపై, డీజే యజమానుల వివరాలను తమకు తెలియజేసి డీజేల నిషేధాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు సహకరించాలని ఎస్సై నాగరాజు ప్రజలను కోరారు.

# పేకాట శిబిరం పై పోలీసుల దాడి



క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ డిసెంబర్ 30

ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ ఆదేశాల ప్రకారం టాస్క్ ఫోర్ సిబ్బందిసంతనూతలపాడు మండలం మంగమూరు గ్రామ శివారులో కోతముక్క పేకాట ఆడుతున్న ఐదుగురిని టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులో తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ. 4160/–లు స్వాధీన పరుచుకొని సంత నూతలపాడు పోలీస్ స్టేషన్ లో అప్పగించారు. టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సిఐ యు. సుధాకర్ ఆధ్వర్యంలో ఎస్సై సుదర్శన్ ,ఏఎస్ఐ మహబూబ్బాషా సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులు ఆధునిక సస్యరక్షణ పద్ధతులను పాటించాలి

## వ్యవసాయ అధికారి శ్రీనివాసులు రెడ్డి




**పొదిలి, పెన్ పవర్, డిసెంబర్ 30**

రైతులు ఆధునిక సస్యరక్షణ పద్ధతులను పాటించాలని మండల వ్యవసాయాధికారి దేవి రెడ్డి శ్రీనివాసులు రెడ్డి కోరారు. మంగళవారం నాడు మండలంలోని పాములపాడు, ఈగల పాడు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులు రెడ్డి ఆయా గ్రామాల్లోని రైతులతో సమావేశం జరిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వారికి అర్థమయ్యే రీతిలో వివరించారు. అలాగే ఆయా గ్రామాల్లోని రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారి శ్రీనివాసులు రెడ్డి వాటి సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేసిన గిద్దలూరు టీడీపీ నాయకులు



**గిద్దలూరు పెన్ పవర్ డిశంబర్ 30**

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 29వ తేదీన జరిగిన రాష్ట్ర క్యాబినేట్ సమావేశంలో ఏపీ జిల్లాల పునర్విభజన ప్రతి పాదనలకు ఆమోదం తెలపడంతో నూతనంగా మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తూ మంగళవారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ జి.ఓ ఎం.ఎస్. నెం.524ను జారి చేసినట్లు జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆదేశాలతో, గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నూతన జిల్లా కావటంతో పశ్చిమ ప్రకాశం వాసుల చిరకాల వాంఛ నెరవేరిందని, మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్లగా, 21 మండలాలతో ఈనెల 31వ తేదీ నుండి నూతనంగా మార్కాపురం జిల్లా ఏర్పాటు కానున్నట్లు, మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డు గల రిహబిటేషన్ అండ్ రీ సెటిల్మెంట్ కాలనీలో గల భవనంలో ఈనెల 31వ తేదీ నుండి మార్కాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకొని పరిపాలనా వ్యవహారాలు కూడా కొనసాగుతాయని తెలిపారు. పశ్చిమ ప్రకాశం అభివృద్ధిలో భాగంగా నూతన జిల్లాకు ఆమోదం తెలిపిన కూటమి ప్రభుత్వానికి గిద్దలూరు నియోజకవర్గ ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు పట్టణ అధ్యక్షులు సయ్యద్ శానేశా వలి, గిద్దలూరు, కంభం మార్కెట్ యార్డ్ చైర్మన్లు బైలడుగు బాలయ్య, పూనూరు భూపాల్ రెడ్డి గిద్దలూరు జడ్పీటీసీ సభ్యులు బుడతా మధుసూదన్,గిద్దలూరు మండల పార్టీ అధ్యక్షుడు మార్థాల సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు దప్పిలి కాశిరెడ్డి, పార్లమెంట్ కోశాధికారి అంబవరం శ్రీనివాస్ రెడ్డి, కోమరోలు మండలపార్టీ అధ్యక్షుడు బొనేని వెంకటేశ్వర్లు , రాష్ట్ర ఎడ్యుకేషన్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ గోన చెన్నకేశవులు, మాజీ ఎంపీపీ రెడ్డి కాశిరెడ్డి, గిద్దలూరు పట్టణ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గోన్నారు.

# మహిళాభివృద్ధికి కూటమి ప్రభుత్వం గట్టి కృషి

## శాసనసభ్యులు నారాయణరెడ్డి

పొదిలి, పెన్ పవర్, డిసెంబర్ 30,

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో మహిళాభివృద్ధి కోసం గట్టి కృషి చేస్తుందని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి చెప్పారు. మంగళవారం నాడు పొదిలి పట్టణంలోని విశ్వనాధపురం లో డిఆర్డిఏ వెలుగు పొదుపు సంఘం ద్వారా బండి ప్రసన్న ఏర్పాటు చేసిన అరకు కాఫీ షాప్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని విధాల అభివృద్ధి చెందితేనే సమాజాభివృద్ధి కూడా ఆశించిన మేరకు జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. అందువల్లనే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళల అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని నారాయణరెడ్డి చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగపరచుకోవడం ద్వారా ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డి సూచించారు. జిల్లా డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళాభివృద్ధి కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పొదిలి



వెలుగు ఏపిఎం గోపాల కృష్ణ, పొదిలి మార్కెట్ కమిటీ చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమామ్ సా, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గునుపూడి భాస్కర్, రాష్ట్ర తెలుగుదేశం రైతు విభాగపు కార్యదర్శి ఆవులూరి ఎల్లమంద, తెలుగుదేశం మహిళా నాయకురాలు, మండల సమాఖ్య అధ్యక్షురాలు షేక్ మెహర్ ఉన్నిసా బేగం, వెలుగు సిబ్బంది తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి

**కొనకనమిట్ల పెన్ పవర్ డిసెంబర్ 30**

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలను ఉపయోగించుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణ అన్నారు. మండలంలోని చినమనగుండం గ్రామంలో ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద గుంటూరీ జ్యోతి అనే మహిళా సభ్యురాలికి మంజూరైన షెడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగు ఆధ్వర్యంలో పొదుపు సంఘాల మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి వినూత్న జీవనోపాధి కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా విస్తరించనున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏపిడి నీలకంఠారెడ్డి,ఎల్‌హెచ్ డీపీఎం రజినీకాంత్,ఏపిఎం సుధాకర్,కెనరా బ్యాంకు మేనేజర్ రమేష్,స్థానిక నాయకులు కోటేశ్వరరావు,చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా ముక్కోటి ఏకాదశి

## భక్తకోటితో పోటెత్తిన వైష్ణవ ఆలయాలు





**గిద్దలూరు పెన్ పవర్ డిశంబర్ 30**

ముక్కోటి ఏకాదశి పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి . వేకువఝాము నుంచే భక్త వైష్ణవ ఆలయాలకు చేరుకుని బారులు తీరి ఉత్తర ద్వారా దర్శనం చేసుకున్నారు. పట్టణంలోని శరాఫ్ బజారులో ని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం , రాచర్ల రోడ్డు లోని వెంకటేశ్వర స్వామి ఆలయం , బద్వేల్ రోడ్డు లోని పట్టాభి రామాలయం, పాత బద్వేల్ రోడ్డులోని రామాలయం, సాయిబాబా మందిరంలో, అంగరంగ వైభవంగా మొక్కోటి ఏకాదశి వేడుక లు జరిగాయి, ఆయాఆలయాల్లో దేవతా మూర్తులను సర్వాంగసుందరంగా అలంకరించారు. ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. శరాఫ్ బజారులో శ్రీ వేంకటేశ్వరుని వినూత్న రీతిలో అలంకరించి భక్తుల దర్శనం కోసం ఉత్తర ద్వార దర్శంకోసం వేంచేపచేశారు. మూలమూర్తిని కూడా సుందరంగా అలంకరించారు. ఈ అలంకారాలు తోటపల్లి చంద్రశేఖర్ శాస్త్రి చేశారు. భక్తులు శ్రీవారిని దర్శించుకొని తీర్థ ప్రాసాదల స్వీకరించారు.

భక్తుల దర్శనార్థం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. వైకుంఠ ఏకాదశి విశిష్టత ముక్కోటి ఏకాదశి పర్వదిన విశేషాలను భక్తులకు వివరించారు

**వైకుంఠ ఏకాదశిని ఎప్పుడు జరుపుకోవాలి...**

సౌరమానం ప్రకారం సూర్యుడు ధనస్సు రాశిలోకి ప్రవేశించడమే ధనుర్మాసం. ధనుర్మాసంలో వచ్చే శుక్లపక్ష ఏకాదశి నాడు ముక్కోటి ఏకాదశి అనగా ధనుర్మాసం ప్రవేశించాక వచ్చే శుద్ధ ఏకాదశి యని

వైకుంఠ ఏకాదశి పర్వదినం. అనగా పవిత్రమైన రోజు. ఆరోజుని భగవంతుని ఆరాధనకే వినియోగించాలని భక్తులందరూ భగవంతుడిని చేరే పవిత్రమైన రోజు వైకుంఠ ఏకాదశి అన్నారు.

ఆరోజున మూడు కోట్ల దేవతలు స్వామిని కొలుచుకోవడానికి వైకుంఠానికి వచ్చిన రోజు అని అందుకే ఇది ముక్కోటిఏకాదశి అని అన్నారన్నారు

లోకకల్యాణార్థం శ్రీమన్నారాయణుడు యోగనిద్ర నుండి లేచిన రోజు! యోగనిద్ర అనగా. యోగము అంటే కూర్చుట. నిద్ర అనగా ఆలోచన.

జీవులకు వారి వారి కర్మలకు తగినటువంటి ఫలితాలను అనుభవించడానికి తగిన శరీరాలను ఇవ్వడానికి చేసే ఆలోచనే యోగనిద్ర.

ఈ పర్వదినం యొక్క ప్రత్యేకత యని, ఉత్తరద్వార దర్శనం అనగా ఉత్తర ద్వారం ద్వారా పరమాత్మ దర్శనం చేయడం.

**ఉత్తర ద్వార దర్శనం అంటే ఏమిటి??**

ఉత్తరంః జ్ఞానము

దక్షిణంః కర్మ ....

అనగా పరమాత్మను జ్ఞానంతోనే దర్శించగలం! అజ్ఞానంతో, మోహంతో, కర్మలతో పరమాత్మని దర్శించ లేమని జ్ఞానం ద్వారానే పరమాత్మను దర్శించుట అన్న దానికి సంకేతమే

ఉత్తరద్వార దర్శనము. ఇంకొక అర్థము ఉత్తరానికి అధిపతి కుబేరుడు. ధనాధిపతియని ధనము అనగా లౌకిక ధనం కాదు. జ్ఞానధనం. లౌకిక ధనం అశాశ్వతం. కానీ జ్ఞానధనం అలా కాదు. కాబట్టి ధనం దిక్కు అనగా ఉత్తర దిక్కు నుండి చూడటం అంటే జ్ఞానంతో పరమాత్మని చూడటంఅన్నారు.

**ఉత్తర ద్వారం అంటే మరో అర్థంః ఇంకొక ద్వారం!**

అక్కడున్న ద్వారం వైకుంఠంలో ఉన్న ద్వారం. జ్ఞానానికి ద్వారం. జ్ఞానం వస్తే లభించేది మోక్షం. మోక్షానికి ద్వారం కాబట్టి ఉత్తర ద్వార దర్శనం అంటే మోక్షద్వారదర్శనం! అన్నారు. కాబట్టి జ్ఞానాన్ని దృష్టిలో పెట్టుకొని జ్ఞానంతోటే జ్ఞానరూపునిగా జ్ఞానవృద్ధి పొందడానికే పరమాత్మని దర్శించాలి అనే సంకేతాన్ని ఉత్తరద్వార దర్శనంలో మనకు ఋషులు సూచించారన్నారు. సనక సనందులు విష్ణుమూర్తి దర్శనానికి వెళుతుంటే ద్వారం దగ్గర ఉన్న జయవిజయులు అడ్డుకుంటారు. అది మనందరికీ తెలుసు కదా!! దానిలో ఉన్న అంతరార్థం తెలుసుకుందాం. పరమాత్మని తెలుసుకోవాలన్నా, చేరుకోవాలన్నా ఉండాల్సింది సత్త్వగుణం. కానీ మనం పరమాత్మని చేరుకోకుండా అడ్డుకునేవి రాజస,తామస గుణాలని ఇదే కథా పరంగా, సత్త్వగుణం అయిన సనకసనందులు పరమాత్మని చూడడానికి వెళ్తుంటే ద్వారం దగ్గర ఉన్న జయ విజయులు అనే రాజస తామస గుణాలు అడ్డుకున్నాయని. వారిని భూమి మీద పడమని అనడం అంటే, వాటిని దూరంగా వదిలించుకునేసరికి, పరమాత్మ లేచి బయటికి వచ్చి సనకసనందులకు దర్శనం ఇచ్చాడని మనలో కూడా రాజస తామసములు అడ్డుకుంటూ ఉంటాయన్నారు. వాటిని పక్కకి తోసి సత్త్వగుణంతో ప్రార్థన చేస్తే పరమాత్మ తనంతట తానే వచ్చి తప్పక దర్శనం ఇస్తాడు. రజోగుణాన్ని వదిలి సత్త్వగుణంతో వెళితే ద్వారం తెరుచుకుంటుందని. ఆ ద్వారమే ఉత్తరద్వారం. అది తెరుచుకున్న పర్వమే వైకుంఠ ఏకాదశి.

వైకుంఠ ఏకాదశి రోజు పొద్దున్నే మనము దేవాలయాల దగ్గర చూస్తూ ఉంటాము. ఆ రోజు దేవాలయాల్లో విపరీతమైన తొక్కిసలాట, గొడవలు. డొనేషన్ ఇచ్చామంటూ.. రికమండేషన్ అంటూ ఏదో రకంగా ఆ ద్వారం నుండి వెళ్లి స్వామిని దర్శనం చేయాలి అనుకుంటారు. అది కాదు చేయవలసింది. మనం వెళ్ళవలసిన దారి 'ఈ'ఉత్తర ద్వారాలు కాదు. సనకసనందులు వెళ్ళిన అసలు ఉత్తరద్వారం అన్నారు. ఉత్తరం అంటే నార్త్ అని మాత్రమే అర్థం కాదు. ఉత్ ష తర వ ఉత్తర ఉత్ అనగా గొప్పది అని అర్థము. ఉత్కృష్టమైన, ఉత్తమము.... అని మనం అంటూ ఉంటాము. ఇక 'తర' అనే శబ్దాన్ని కంపారిటివ్ గా వాడేటప్పుడు వాడతారు. ఉదాహరణకి గుడ్ బెట్టర్ బెస్ట్ లలో .... బెటర్ తర. ఇంకో దానితో పోల్చేటప్పుడు ఉత్తర. మనం సృష్టిలో అన్నీ గొప్పగొప్పవి అనుకుంటున్నాము. వాటి కన్నా ఇదే గొప్పది అనడమే ఉత్తర. అన్నింటి కన్నా గొప్పది భగవద్దర్శనం. దేని ద్వారా మనం భగవంతుని చేరుకుంటామో అది ద్వారం.. అనగా జ్ఞానం భక్తి ..! అదే ఉత్తరం. పరమాత్మ ను చూడాలంటే భక్తి, జ్ఞానం అనే తలుపులు తెరుచుకోవాలి. ఉత్తర అనగా అన్నిటికంటే గొప్పది. సాధారణంగా ఈ సమయంలో బయట వాతావరణం చాలా చలిగా ఉంటుంది. ఈ సమయంలోనే సూర్యభగవానుడు ఉత్తరాయణంలోకి ప్రవేశిస్తాడు. ఉత్తర అంటే సూర్యుడు ఇదివరకటి కంటే గొప్పగా కనపడతాడు. సూర్యకిరణాల్లో దేవతా శక్తులు ఉంటాయి. ఉత్తరాయణంలో మనకి కిరణ శక్తి బాగా లభిస్తుంది. వైకుంఠంలో ఉన్న నారాయణుడే మనకు సూర్యనారాయణుడి గా కనపడుతున్నాడు. మనకు ప్రత్యక్షంగా కనిపిస్తున్న సూర్యుని ద్వారా వైకుంఠంలో ఉన్న విష్ణువుని భావించవచ్చు. వైకుంఠంలోని విష్ణువు మనకు కనపడట్లేదు, కానీ కనిపిస్తున్న ఈ సూర్యభగవానుడిని నేనే, అంటూ ఆయనే చెప్పాడు. గీతలో స్వామి, సూర్యునిలోని కాంతిని నేనే అన్నాడుగా!! అందుకే మన పెద్దలు మనకు సూర్యనారాయణుడు అనేమాట అలవాటు చేశారు.

అందుకే ఏ హిందువు అయినా... ప్రత్యక్ష భగవానుడు, సూర్య నారాయణుడు అనే అంటాము. ఈ సమయంలో సూర్యుడు దక్షిణం నుండి ఉత్తరం వైపు తిరిగేటప్పటికి ఉత్తర ద్వారం ఉంటుంది. మనకు అందరికీ తెలిసిన సూర్యమంత్రం "ఆరోహన్నుత్తరాం దివం దేవః

ఈ మంత్రం "ద్వాదశఆర్య సూర్యస్తుతి" లో ఉంటుంది. వేదంలో సూర్య మంత్రం లో ఉత్తర దివం దేవః అని వాడారు.

ఇక్కడ కూడా ఉత్తరం అనగా ఉత్కృష్టంగా ప్రకాశిస్తున్న సూర్యభగవానుడికి నమస్కారము అని అర్థంఅన్నారు

కాబట్టి ఇప్పుడు తెరుచుకోవాల్సింది ఈ ద్వారం. ఇప్పుడున్న దాని కన్నా గొప్ప ద్వారం. ఏ ద్వారమయితే మనల్ని పరమాత్మ దగ్గరికి చేరుస్తుందో, ఏ ద్వారం ద్వారా పరమాత్మ దగ్గరికి వెళతామో అది మనలో తెరచుకోవాలన్నారు.

తెరచుకోవాలి అంటే దానికి అడ్డుగా ఉన్న రాజస తామస గుణాలని తీసేయాలి. అప్పుడే లోపలికి వెళ్లగలం. అప్పుడే పరమాత్మ అందుతాడు. అదే ఈ కథలోని అంతరార్థం అని పేర్కొన్నారు

కాబట్టి మనలో ఉత్తర ద్వారం తెరుచుకోవాలి అంటే ఎంతో సాధన చేయాలి. అలా అని ఇప్పుడు ఇక్కడ దేవాలయాలలో ఉత్తర ద్వార దర్శనం మానేయమని, అర్థం కాదు. అవన్నీ చేయమని, ఇవి సంకేతాలు అని తెలుసుకోవాలన్నారు.

ఇటువంటివన్నీ చెయ్యగా చెయ్యగా ఎప్పుడో పాపాలన్నీ పోయి అటువంటి సాధన చేయాలనే బుద్ధి పుడుతుందన్నారు. కాబట్టి బాహ్యంలో చేయాలి, కానీ అంతరార్థం కూడా తెలుసుకోవాలి.

ఇది కనుక చేయగలిగితే ముక్కోటి దేవుళ్ళు ఆయన లోనే ఉన్నారు. కాబట్టి సర్వదేవతాత్మకుడైన ఆయన్ని దర్శిస్తే అదే ముక్కోటి ఏకాదశి..

**ఇక ఏకాదశి అంటే..**

మనలో ఉన్న 11 ని ఒక్కటి చేసి భక్తి జ్ఞానం అనే ద్వారంగుండా వెళ్లడం. మనలో ఉన్న 11 ఏంటంటే, ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు, ఒక మనసు. ఈ 11ని ఒక్కటి చేయడమే నిజమైన ఏకాదశి. అలా ఎలా చేయాలి ?? అని మనకు అనిపించవచ్చు.. కానీ మన అందరికీ ప్రహ్లాదుడు నేర్పించాడుగా! కమలాక్షు నర్చించు కరములు కరములు శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ... అంటూ

ఈ పదకొండు ఒక్క శరీరంలోనే ఉన్నాయి. వీటన్నిటితో భగవంతుని అనుభవం పొందడమే అసలయిన ఏకాదశి. పదకొండూ ఆయన దగ్గర పెట్టి 12 వ దైన ద్వాదశి దగ్గరికి వెళ్తున్నాము. ఏకాదశి వ్రతం చేసేది ద్వాదశి కోసమే.

ద్వాదశి తిథికి అధిపతి విష్ణువు. ఏకాదశికి అధిపతి యముడు. అనగా ఏకాదశినాడు ఉపవాస దీక్షతో మనసుని శరీరాన్ని తపింప చేయడం వలన యముడు పెట్టే బాధలు లేవు. జీవుడు శుద్ధమవుతాడు. అప్పుడు తిండి కోసం ఆలోచించకుండా విష్ణువు గురించే ఆలోచిస్తాడు. పదకొండు ఇంద్రియాలను ఆయన దగ్గర ఉంచడం వలన ఆయన మనని పన్నెండవ వాడిగా తనలోకి తీసుకుంటాడు. అదే ద్వాదశి పారణ. ద్వాదశి విష్ణువు కు చాలా ప్రధానం అన్నారు. ఏకాదశి ఉపవాసం, ద్వాదశి పూజకు అర్హత ఇస్తుందన్నారు.అలా ఇంద్రియాలు మనస్సుని శుద్ధం చేసుకుని భక్తి జ్ఞానం అనే ద్వార%ళి% గుండా పరమాత్మ దర్శనం చేద్దాము, తరిద్దాము.. అదే ఉత్తర ద్వార దర్శనం యొక్క ప్రాముఖ్యత అని అర్చకులు పేర్కొన్నారు.

# న్యూ ఇయర్ మత్తులో డ్రంక్ అండ్ డ్రైవింగ్ చేస్తే జైలే...

## డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తే క్షమించేదే లేదు.

## ఎస్సై సంపత్ కుమార్ కఠిన హెచ్చరిక




**పుల్లల చెరువు పెన్ పవర్ డిసెంబర్ 30**

నూతన సంవత్సర వేడుకలను ఆనందంగా జరుపుకోవాలని, అయితే ఆ ఆనందం ఇతరుల ప్రాణాలకు ప్రమాదంగా మారకూడదని పుల్లల చెరువు ఎస్సై సంపత్ కుమార్ ప్రజలకు కఠిన హెచ్చరిక జారీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ఎలాంటి సానుభూతి చూపకుండా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ప్రతి సంవత్సరం న్యూ ఇయర్ వేడుకల సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కారణంగా రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని, ప్రాణనష్టాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ఈసారి ముందస్తుగా పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు పోలీస్ శాఖ వెల్లడించింది. ప్రజల ప్రాణాల రక్షణే పోలీసుల ప్రధాన బాధ్యత అని ఎస్సై తెలిపారు.న్యూ ఇయర్ వేడుకలను కుటుంబ సభ్యులతో, స్నేహితులతో సురక్షితంగా జరుపుకోవాలని, మత్తులో వాహనం నడిపితే అది నేరమే కాకుండా తీవ్రమైన శిక్షలకు దారి తీస్తుందని హెచ్చరించారు. "మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే శిక్ష తప్పదు. చట్టం అందరికీ సమానమే" అని ఎస్సై సంపత్ కుమార్ స్పష్టం చేశారు.న్యూ ఇయర్ రాత్రి నుంచి జనవరి 1 వరకు మండలవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు నిర్వహిస్తామని వెల్లడించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిని తక్షణమే అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని హెచ్చరించారు.అలాగే బార్లు, హోటళ్లకు ప్రత్యేక ఆంక్షలు విధిస్తూ రాత్రి 1 గంటలోపే మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అనుమతుల నిబంధనలు అతిక్రమించిన బార్లు, హోటళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ప్రజలు పోలీసులకు సహకరించాలని, బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తూ సురక్షితమైన న్యూ ఇయర్ వేడుకలను జరుపుకోవాలని ఎస్సై సంపత్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# ఎక్సైజ్ తనిఖీలపై తీవ్ర ఆరోపణలు



కందుకూరు పెన్ పవర్, డిసెంబర్ 30:

కందుకూరు నియోజకవర్గంలో ఎక్సైజ్ శాఖ తనిఖీలు తూతూ మంత్రంగానే కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కందుకూరు మండలం మాచవరం గ్రామం మినహా నియోజకవర్గంలో ఎక్కడా అక్రమ మద్యం విక్రయాలు జరగడం లేదన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు నడుస్తున్నప్పటికీ, నెల మామూలు ఇచ్చిన వారిపై చర్యలు లేకుండా వదిలేస్తూ, ఇవ్వని వారినే లక్ష్యంగా చేసుకుని కేసులు నమోదు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ మామూలు వ్యవహారాన్ని ఎక్సైజ్ కానిస్టేబుల్ సుబ్రమణ్యం అనే వ్యక్తి చూసుకుంటున్నాడన్న ప్రచారం కూడా సాగుతోంది. కందుకూరు పట్టణంలో ఉదయం 4 గంటల నుంచే మద్యం దుకాణాలు తెరుచుకుని, సిట్టింగ్ అనుమతులు లేకపోయినా మద్యం విక్రయాలు కొనసాగుతున్నా ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.ప్రతినెల మామూలు తీసుకుంటూ ఆయా దుకాణాల జోలికి వెళ్లడం లేదన్న విమర్శలు ఉన్నాయి.ఇదే సమయంలో మామూలు ఇవ్వని మాచవరం కొండ ప్రాంతంలోని బెల్ట్ షాపులపై మాత్రమే దాడులు చేసి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పది రోజుల క్రితం ఓ వ్యక్తి వద్ద మద్యం బాటిల్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలుస్తోంది. మొత్తంగా మామూలు ఇవ్వని వారినే టార్గెట్ చేసి ఎక్సైజ్ అధికారులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు కందుకూరు నియోజకవర్గంలో తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఈ అంశంపై ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# సర్వసభ్య సమావేశానికి అధికారులు డుమ్మా


**కొనకనమిట్ల పెన్ పవర్ డిసెంబర్ 30**

కొనకనమిట్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మురళీ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి పలు శాఖలకు చెందిన అధికారులు హాజరుకాకపోవడంతో సమావేశం కొంతసేపు ఉద్రిక్తంగా మారింది.అధికారుల గైర్హాజరుపై పలువురు సర్పంచులు,సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు.ఆయా శాఖలకు సంబంధించిన సమస్యలపై సమాచారం ఎవరు అందిస్తారని ఎంపిడిఓను ప్రశ్నించారు.ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సర్వసభ్య సమావేశానికి అధికారులు డుమ్మా కొట్టడం తగదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పలువురు సభ్యులు తమ గ్రామాలలో నెలకొన్న తాగునీరు,రహదారులు, పారిశుద్ధ్యం తదితర సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.సంబంధిత అధికారులు లేకపోవడంతో సమస్యలకు తక్షణ పరిష్కారం లభించకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు.భవిష్యత్తులో జరిగే సర్వసభ్య సమావేశాలకు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు.





# వెంకటేశ్వర స్వామి సన్నిధిలో అనిల్ దంపతులు



**పొదిలి, పెన్ పవర్, డిసెంబర్ 30**

పొదిలిలోని శ్రావణి ఎస్టేట్ లో గల లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి వరికుంట్ల అనిల్ కుమార్ సురేఖ దంపతులు దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళవారం నాడు అనిల్ కుమార్ దంపతులు వెంకటేశ్వర స్వామి ని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అనిల్ కుమార్ మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవమైన వెంకటేశ్వర స్వామిని తాము దర్శించుకున్నామని, రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు చెప్పారు. అలాగే ప్రజాసేవే ప్రధాన ధ్యేయంగా తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్న మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, ఆయన కుటుంబాన్ని వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, వారంతా ఆయురారోగ్య లతో వర్ధిల్లాలని తాము వెంకటేశ్వరుని వేడుకున్నట్లు అనిల్ కుమార్ చెప్పారు. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న అనిల్ కుమార్ దంపతులను ఆలయ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

# నూతన సంవత్సరం,సంక్రాతి సంబరాలలో కట్టుదిట్టమైన పోలీస్ నిఘా..!

**కోడిపందాలు,పేకాటలు ఆడితే కఠిన చర్యలు తప్పవు..**

**సీలేరు ఎస్ఐ ఎండి.యాసిన్ హెచ్చరిక.**

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,డిసెంబర్ 30**: రానున్న నూతన సంవత్సరం, సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సీలేరు ఎస్ఐ ఎండి.యాసిన్ సూచించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరం,సంక్రాతి పండుగల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన నిఘా ఏర్పాట్లు చేసామని,అలాగే భద్రతా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎస్ఐ అన్నారు. సంబరాలను పురస్కరించుకొని చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సంబంధిత వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సంబరాలను ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని, చట్టాన్ని అతిక్రమించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.మత్తుపదార్థాల వినియోగం, శబ్ద కాలుష్యానికి కారణమయ్యే కార్యక్రమాలను పూర్తిగా నిషేధించినట్లు స్పష్టం చేసారు.ఇదే క్రమంలో కోడి పందాలు, పేకాటలు వంటి అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తూ పోలీసులకు చెప్పామని చెబుతూ అసాంఘిక కార్యకలాపాలు చేపట్టే వారిపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని, దాడులు నిర్వహించి కేసులు కడతామని ఈ సందర్భంగా ఎస్సై యాసీన్ ఆ ప్రకటనలో హెచ్చరించారు.

# 2026 T20 ప్రపంచ కప్‌కు ఇంగ్లాండ్ జట్టు ప్రకటన.. డేంజరస్ బౌలర్ రీ ఎంట్రీ




**హైదరాబాద్ పెన్ పవర్:** లండన్: 2026 టీ20 వరల్డ్ కప్ కోసం ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) తమ జట్టును ప్రకటించింది. 15 మంది పేర్లతో కూడిన జట్టును మంగళవారం (డిసెంబర్ 30) ఈసీబీ అనౌన్స్ చేసింది. యంగ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. యాషెస్ సిరీస్‌లో గాయపడ్డ డేంజరస్ పేసర్ జోఫ్రా ఆర్చర్ వరల్డ్ కప్ జట్టులో స్థానం దక్కించుకున్నాడు.

మెగా టోర్నీ ప్రారంభ సమయానికి ఒకవేళ ఆర్చర్ కోలుకోకపోతే అతడి స్థానంలో బ్రైడాన్ కార్స్ బరిలోకి దిగనున్నాడు. ఇక, తన కెరీర్‌లో ఇంగ్లాండ్ తరపున ఒక్క వైట్-బాల్ మ్యాచ్ కూడా ఆడని పేసర్ జోష్ టంగ్ అనుహ్యంగా టీ20 వరల్డ్ కప్ స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్నాడు. యాషెస్ సిరీస్‌లో ప్రదర్శన ఆధారంగా టంగ్ టీ20 జట్టుకు ఎంపికయ్యాడు.

2026 టీ20 వరల్డ్ కప్‌కు భారత్, శ్రీలంకలు సంయుక్తంగా అతిథ్యమిస్తున్నాయి. 2026, ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. ఈ మెగా టోర్నీకి ఫిబ్రవరి 7న పాకిస్తాన్ - నెదర్లాండ్ మ్యాచ్‌తో తెరలేవనుంది. క్రికెట్ ప్రపంచంలో అత్యంత రసవత్తరంగా, ఫ్యాన్స్ థ్రిల్లింగ్?గా ఫీలయ్యే ఇండియా-పాక్ జట్ల మధ్య మ్యాచ్ ఫిబ్రవరి 15న కొలంబోలో జరగనుంది. ఇండియా, పాకిస్తాన్ , అమెరికా(USA), నమీబియా, నెదర్లాండ్స్ ఒకే గ్రూపులో ఉన్నాయి.ఈసారి ఈ మెగా టోర్నీలో 20 జట్లు తలపడనున్నాయి. భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్, యూఏఈ, ఒమన్, వెస్టిండీస్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే, ఐర్లాండ్, ఇంగ్లాండ్, నెదర్లాండ్స్, ఇటలీ, నేపాల్, పాకిస్థాన్ జట్లు టోర్నమెంట్ లో భాగం కానున్నాయి

ఇంగ్లాండ్ టీ20 ప్రపంచ కప్ జట్టుహ్యారీ బ్రూక్ (సి), రెహాన్ అహ్మద్, జోఫ్రా ఆర్చర్, టామ్ బాంటన్, జాకబ్ బెథెల్, జోస్ బట్లర్, బ్రైడాన్ కార్స్, సామ్ కుర్రాన్, లియామ్ డాసన్, బెన్ డకెట్, విల్ జాక్స్, జామీ ఓవర్టన్, ఆదిల్ రషీద్, ఫిల్ సాల్ట్, జోష్ టంగ్, ల్యూక్ వుడ్

# హైదరాబాద్‌కు ఏమైంది..? విజయ్ హజారే ట్రోఫీలో వరుసగా మూడో ఓటమి



**హైదరాబాద్ పెన్ పవర్:** బ్యాటర్లు రాణించి భారీ స్కోరు చేసినా విజయ్ హజారే వన్డే ట్రోఫీలో హైదరాబాద్ వరుసగా మూడో ఓటమిని ఎదుర్కొంది. సోమవారం జరిగిన గ్రూప్-బి పోరులో అస్సాం 4 వికెట్ల తేడాతో హైదరాబాద్‌పై గెలిచింది. తొలుత రాహుల్ సింగ్ (79), అభిరత్ రెడ్డి (54), నితేష్ రెడ్డి (53) హాఫ్‌సెంచరీలతో రాణించడంతో హైదరాబాద్ నిర్ణీత 50 ఓవర్లలో 310/8 స్కోరు చేసింది. అస్సాం బౌలర్లలో అబ్దుల్ అజీజ్ మూడు వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఛేజింగ్‌లో అస్సాం 49.3 ఓవర్లలో 314/6 స్కోరు చేసి గెలిచింది. ఆ టీమ్ ప్లేయర్ శివ్ శంకర్ రాయ్ (112) సెంచరీతో సత్తా చాటాడు. కెప్టెన్ సీవీ మిలింద్ మూడు వికెట్లు తీసినా మిగతా బౌలర్లు ఫెయిలయ్యారు. బుధవారం జరిగే తర్వాతి మ్యాచ్‌లో బరోడాతో హైదరాబాద్ పోటీపడనుంది.

# మలింగకు కీలక బాధ్యతలు అప్పగించిన శ్రీలంక క్రికెట్ బోర్డు

- శ్రీలంక ఫాస్ట్ బౌలింగ్ కన్సల్టెంట్‌గా మాజీ పేసర్ మలింగ నియామకం
- టీ20 ప్రపంచకప్ కోసం లంక పేసర్లకు ప్రత్యేక శిక్షణ
- నెల రోజుల పాటు సేవలు అందించనున్న మలింగ
- భారత్, శ్రీలంక వేదికగా త్వరలో జరగనున్న మెగా టోర్నీ
- మలింగ అపార అనుభవం జట్టుకు కలిసొస్తుందన్న శ్రీలంక బోర్డు



**హైదరాబాద్ పెన్ పవర్:** 2026 టీ20 ప్రపంచకప్‌నకు సన్నాహాల్లో భాగంగా శ్రీలంక క్రికెట్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. పేస్ దిగ్గజం, యార్కర్ స్పెషలిస్ట్ లసిత్ మలింగను జాతీయ జట్టుకు 'ఫాస్ట్ బౌలింగ్ సలహాదారు'గా నియమించింది. ఈ మెగా టోర్నీకి భారత్‌తో పాటు శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న నేపథ్యంలో, తమ బౌలింగ్ దళాన్ని పటిష్టం చేసేందుకు బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. మలింగ నియామకం స్వల్పకాలిక ప్రాతిపదికన జరిగింది. దాదాపు నెల రోజుల పాటు మలింగ ఈ బాధ్యతల్లో కొనసాగుతాడని ఎస్ఎల్‌సీ మంగళవారం ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. ఈ సమయంలో మలింగ తన అపార అనుభవంతో జాతీయ ఫాస్ట్ బౌలర్లకు మెరుగులు దిద్దనున్నాడు. ముఖ్యంగా టీ20 ఫార్మాట్‌లో అత్యంత కీలకమైన 'డెత్ బౌలింగ్' (చివరి ఓవర్లు) వేయడంలో పేసర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నాడు.అంతర్జాతీయ క్రికెట్‌లో మలింగకు ఘనమైన రికార్డు ఉంది. 30 టెస్టులు, 226 వన్డేలు, 84 టీ20 మ్యాచ్‌లు ఆడిన ఈ వెర్సటైల్ పేసర్.. ఆయా ఫార్మాట్లలో వరుసగా 101, 338, 107 వికెట్లు పడగొట్టాడు. 2014లో శ్రీలంక టీ20 ప్రపంచకప్ గెలవడంలో మలింగ కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ సహా ప్రపంచవ్యాప్తంగా అనేక లీగ్‌లలో ఆడిన అనుభవం అతడి సొంతం. 2026 ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ ఫిబ్రవరి 7న ప్రారంభం కానుంది. కొలంబోలోని ఎస్ఎస్‌సీ మైదానంలో తొలి మ్యాచ్ జరగనుంది. స్వదేశంలో జరుగుతున్న ఈ మెగా టోర్నీ కోసం శ్రీలంక జట్టును సన్నద్ధం చేయడంలో మలింగ అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుందని బోర్డు ఆశిస్తోంది.

**ప్రిషా రాజేష్ సింగ్ ఎరుపు రంగు చీరలో బీచ్ సైడ్ గ్లామర్ తో అదరగొట్టింది**



# కింగ్100లో కూలీ లుక్ లో నాగ్

అక్కినేని నాగేశ్వరరావు కొడుకుగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన నాగార్జున ఆ తర్వాత తనదైన స్టైల్ లో ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. రొమాంటిక్ హీరోగా, ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా, యాక్షన్, మాస్, భక్తిరస చిత్రాలు మాత్రమే కాకుండా అన్ని రకాల జానర్లలోనూ నాగ్ తనదైన ముద్ర వేసి స్టార్ హీరోగా ఎదిగారు. అలాంటి నాగ్ ఇప్పుడు తన కెరీర్లో మైల్ స్టోన్ ఫిల్మ్ అయిన 100వ సినిమాతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే.

**100వ సినిమా కోసం నాగ్ స్పెషల్ కేర్**

వాస్తవానికి నా సామిరంగ సినిమా తర్వాత నాగ్ వెంటనే తన 100వ సినిమాను చేయాల్సింది కానీ 100వ ప్రాజెక్టు కాబట్టి కాస్త జాగ్రత్త తీసుకునే నేపథ్యంలో కాస్త ఆలస్యమైంది. అందుకని నాగ్ ఈ గ్యాప్ లో ఖాళీగా లేరు. ఈ గ్యాప్ లో నాగ్ వేరే హీరోల సినిమాల్లో కీలక పాత్ర చేయడం, విలన్ గా కనిపించడం, బిగ్ బాస్ లాంటివి చేస్తూ ఆడియన్స్ కు అందుబాటులోనే ఉన్నారు.

**కుబేర, కూలీ తో ఆకట్టుకున్న నాగ్**

రీసెంట్ గా కుబేర, కూలీ సినిమాల్లో నటించి తన యాక్టింగ్ తో అందరినీ మెప్పించిన నాగ్, తన 100వ సినిమా విషయంలో చాలా ప్లాన్డ్ గా ఉన్నారు. ఈ మైల్ స్టోన్ ఫిల్మ్ కు కోలీవుడ్ డైరెక్టర్ రా కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా, ఈ మూవీ షూటింగ్ పై ఓ అప్డేట్ తెలుస్తోంది.



**కేరళలో కింగ్100**

కింగ్100 వర్కింగ్ టైటిల్ తో తెరకెక్కుతున్న ఈ మూవీ నెక్ట్స్ షెడ్యూల్ కేరళలో ఉంటుందని సమాచారం. రీసెంట్ గా వచ్చిన కూలీ సినిమాలో నాగ్ ఎలాంటి హెయిర్ స్టైల్ తో అయితే కనిపించారో ఇప్పుడీ సినిమాలో కూడా అదే హెయిర్ స్టైల్ తో కనిపించనున్నారని తెలుస్తోంది. కాగా ఈ మూవీకి లాటరీ కింగ్ అనే టైటిల్ ను పరిశీలిస్తున్నారట. మరి ఈ సినిమా ఏ జానర్ లో రానుంది? మిగిలిన విషయాలు త్వరలోనే వెల్లడి కానున్నాయి.

**ఆంచల్ ముంజాల్ హాయిగా గళ్ల చొక్కా దుస్తులలో సంవత్సరాంతపు చలిని ఆస్వాదిస్తోంది**



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com